రిజిస్ట్రేషన్ శాఖ మార్కెట్ విలువలపై

అభ్యంతరాలు తెలియజేయండి : జేసీ

నెల్లూరు (హరనాథపురం) జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : భూములు, ఇళ్ల స్థలాల విలువల మార్పులపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని జిల్లా మార్కెట్ విలువల రివిజన్ కమిటీ చైర్మన్, జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక మార్కెట్ విలువలను ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో, సబ్ రిజిస్ట్రార్, తహసీల్దారు, ఎమ్పీడీవో, ఆర్డీవోకార్యాలయాలతోపాటు కలెక్టరేట్‌లోని నోటీసు బోర్డులలో ఉంచినట్లు తెలిపారు. ఈ నెల 24లోపు అభ్యంతరాలు తెలియజేయాలని కోరారు.

గీత కులాలకు వైన్‌షాపులు!

- జిల్లాకు 18 దుకాణాల కేటాయింపు
- దక్కించుకునేందుకు వ్యాపారుల కసరత్తు



గీత కులాలకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సదరు కులాల వారికి వైన్ షాపులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రకారం జిల్లాకు 18 వైన్‌షాపులు దక్కాయి. జనాభా ప్రాతిపదికన ఏ మండలానికి ఎన్ని షాపులు కేటాయించాలి అన్న దానిపై కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. కాగా, ఈ వైన్‌షాపులకు లైసెన్స్ ఫీజు సగమే ఉండటంతో సిండికేట్ వ్యాపారులు అప్పుడే గీత కార్మికుల ఇళ్ల వద్దకు వాలిపోయారు. అన్నీ తామే చూసుకుంటామంటూ ఆఫర్ల వర్షం కురిపిస్తున్నారు.

- వివరాలు 6లో..

జేఈఈ మెయిన్స్ నేటి నుంచే!

- జిల్లాలో 10వేల మందికిపైగా హాజరు

నెల్లూరు (విద్య), జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఐఐటీ, ఎన్ఐటీలలో ఇంజనీరింగ్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్నాయి. 30వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనుండగా తొలివిడతగా బుధవారం నుంచి 24వ తేదీ వరకు, రెండోవిడత 25 నుంచి 29వతేదీ వరకు ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టులలో జరగనున్నాయి. జిల్లావ్యాప్తంగా 10వేల మందికిపైగా విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. కోవూరు మండలం గంగవరంలోని గీతాంజలి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, పొట్టిపాళెంలోని ఇయాన్ డిజిటల్ జోన్, తిరుపతి జిల్లా కోటలోని ఎన్‌టీకేఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) పర్యవేక్షణలో జరిగే పరీక్షలకు కఠిన నిబంధనలు అమలు చేయనున్నారు.

ఆర్టీసీకి పండుగే!

- సంక్రాంతికి 394 ప్రత్యేక బస్సు సర్వీసులు
- జిల్లాకు రూ.1.11 కోట్ల ఆదాయం

పల్లె జనానికే కాదు.. ఏపీఎస్ ఆర్టీసీకీ సం'క్రాంతు'లు నింపింది. పెద్ద పండుగ సందర్భంగా దూరప్రాంతాల నుంచి సొంతూళ్లకు వచ్చి, వెళ్లే వారి కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడిపింది. ఇలా నెల్లూరు రీజియన్ పరిధిలో దాదాపు 394 బస్సులను ఏర్పాటు చేయగా, పండుగ రోజుల్లో రూ.1.11 కోట్ల ఆదాయం సమకూరింది.



సంక్రాంతి (పెద్ద పండుగ) పండుగ రోజుల్లో జిల్లాకు వచ్చి తిరిగి వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ అధికారులు 394 స్పెషల్ బస్సులు ఏర్పాటు చేశారు. బెంగళూరు, హైదరాబాదు, విశాఖపట్టణం, చెన్నై తదితర ప్రాంతాలకు ఈ సర్వీసులు నడిచాయి. జిల్లాలోని డిపోల వారీగా నెల్లూరు-1 నుంచి 95, నెల్లూరు-2 నుంచి 95, ఆత్మకూరు నుంచి 31, కావలి నుంచి 26, కందుకూరు నుంచి 69, రాపూరు నుంచి 17, ఉదయగిరి నుంచి 61 బస్సులు నడిచాయి. ఈ ప్రత్యేక బస్సుల్లోనూ ప్రయాణికుల నుంచి సాధారణ చార్జీలనే వసూలు చేశారు. 2,96,738 కిలోమీటర్ల దూరం బస్సుల నడపగా, 30,652 మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు. ఇక రూ.1,11,66,421 కోట్లు నెల్లూరు రీజియన్‌కు ఆదాయం సమకూరింది.

- నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)



వంశీధర్‌రెడ్డిని సత్కరిస్తున్న బీజేపీ నేతలు

బీజేపీ జిల్లా సారథిగా మళ్లీ వంశీధరే!

- రెండోసారి అవకాశం ఇచ్చిన అధిష్ఠానం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా అధ్యక్ష పగ్గాలు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డికే దక్కాయి. సహజంగా ప్రతి మూడేళ్లకు ఒకసారి జిల్లా అధ్యక్షుల ఎంపిక జరుగుతుంది. అయితే ఆరేళ్లకు ఒకసారి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం దేశవ్యాప్తంగా జరిగిన సమయంలో జిల్లా అధ్యక్షుల నుంచి రాష్ట్ర అధ్యక్షుల వరకు మార్పులు చేర్పులు ఉంటాయి. ఈ క్రమంలో 2024లో బీజేపీ సభ్యత్వ నమోదు జరగడంతో జిల్లా అధ్యక్షుడు ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. అధ్యక్షుడిగా శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి ఇప్పటికి 17 నెలలే అయినా తప్పనిసరి పరిస్థితుల్లో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఈ క్రమంలో జిల్లా నుంచి 11 మంది పోటీలో నిలవగా, సోమవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఎన్నికల పరిశీలకులు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నామినేషన్‌లు స్వీకరించారు. ఈ క్రమంలో మంగళవారం పార్టీ ఎన్నికల పరిశీలకులు జిల్లా అధ్యక్షుడిగా రెండవసారి శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి పేరును ప్రకటించారు. అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలు వంశీధర్‌రెడ్డికి శాలువాలు, పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు బీజేపీ కార్యాలయం నుంచి వీఆర్సీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు వాకాటి నారాయణరెడ్డి, కందికట్ల రాజేశ్వరి, గుండ్లపల్లి భరత్‌కుమార్ యాదవ్, కర్నాటి ఆంజనేయరెడ్డి, కమల, యర్రబోలు రాజేష్, యశ్వంత్‌సింగ్, విజయ్‌కుమార్, దాసరి ప్రసాద్, చిలకా ప్రవీణ్, పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు.

'మెప్మా'లో అక్రమాలకు చెక్!

జిల్లాలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో అక్రమాలకు, బోగస్ పొదుపు సంఘాలకు ఇక చెక్ పడనుంది. అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై వేటు వేసేందుకు రంగం సిద్ధమవుతోంది. వైసీపీ పాలనలో పొదుపు సంఘాల స్ఫూర్తి దెబ్బతిన్నది. సంఘాల పేరుతో అధికారులు, కొంతమంది నాయకులు విడుదలైన నగదు దిగమింగారు. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారంపై దృష్టి సారించింది. ప్రభుత్వ పథకాలకు అర్హులు, అనర్హులు ఎవరు? వారికి ఎంత లబ్ధి చేకూరింది తదితర అంశాలను సర్వే ద్వారా సేకరించి, కంప్యూటరీకరణ ద్వారా గుర్తిస్తారు. ప్రతి మహిళ లక్షాధికారి కావాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్ష, ఈ ప్రకారం కార్యాచరణ మొదలైంది.

- పక్కా సర్వేకు కూటమి ప్రభుత్వం శ్రీకారం
- పొదుపు సంఘాల వివరాల కోసం యాప్



నెల్లూరు (హరనాథపురం), జనవరి 21(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మెప్మాలో 14,366 పొదుపు సంఘాలు ఉన్నాయి. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 9,554, కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో 1,359, కావలిలో 2028, ఆత్మకూరులో 754, బుచ్చిలో 671 పొదుపు సంఘాలు ఉన్నాయి. పొదుపు సంఘాల సభ్యులు నెలవారి సమావేశాలు నిర్వహిస్తుంటారు. అయితే, ఈ సమావేశాలకు రాకుండా వచ్చినట్లు నమోదు చేయడం, మృతులనూ సభ్యులుగా కొనసా గించడం, బినామీ పేర్లతో సంఘాలను ఏర్పాటు చేసి రుణాలు కాజేయటం, పొదుపు నిధులను ఇష్టానుసారం అప్పుగా ఇవ్వడం వంటి అనేక రకాల మోసాలు జరుగుతున్నాయి. ఇక వీటన్నిటికీ చెక్ పడనుంది. ఇక నెలవారీ సమావేశాలకు బయోమెట్రిక్ ఆధారిత ముఖ హాజరు తప్పనిసరి చేశారు.

ప్రత్యేక యాప్ రూపకల్పన

పొదుపు సంఘాల్లో ప్రతి సభ్యురాలి వివరాలు చిటికెలో తెలుసుకునేలా మెప్మా ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌లో పొదుపు సంఘాల సమగ్ర వివరాలు నమోదు చేస్తున్నారు. సభ్యుల ఆధార్‌తో అనుసంధానమైన పేర్లు, సంఘాల్లో వారు చేరిన తేదీ, విద్యార్హత, కులం, పిల్లలు, వైకల్యం, గ్యాస్ కనెక్షన్, ప్రభుత్వ పథకాల్లో ఎంతమంది లబ్ధి పొందారు? ఎవరికి రాలేదు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు, జీవనోపాధి, వృత్తిపరమైన నైపుణ్యం, నెలసరి ఆదాయం, వ్యక్తిగత పొదుపు వివరాలు నమోదు చేస్తున్నారు. అలాగే సంఘం సభ్యురాలి కుటుంబంలోని వ్యక్తుల విద్యార్హతలు, పారిశ్రామికంగా అభివృద్ధికి వున్న అవకాశాలు, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల కోసం రుణాలు ఆవశ్యకత, కుటుంబ సభ్యుల్లో నిష్ణాతులు ఉంటే ఆ వివరాలు కూడా యాప్‌లో నమోదు చేస్తారు . అంతేగాక పొదుపు రుణాలు, వడ్డీ చెల్లింపులు, మాఫీలు, నెలవారీ సమావేశాలు అప్‌లోడ్ చేస్తున్నారు. రుణాల చెల్లింపుల్లో సక్రమంగా ఉన్న గ్రూపులకు ప్రాధాన్యత ఇస్తారు. ఇందుకోసం మెప్మా కోర్ బ్యాంకింగ్ వ్యవస్థను అందుబాటులోకి తేనుంది. సభ్యుల వ్యక్తిగత ఖాతాలకే నగదు జయచేయటం ద్వారా మామూళ్ల బెడద కూడా ఉండదు. ఈ యాప్‌లో ఒక్కో సభ్యురాలికి ఒక్కో గుర్తింపు సంఖ్యను ఇస్తారు.

ఆర్థిక స్వావలంబనకు అవకాశం



సర్వే ద్వారా యాప్‌లో పొదుపు సంఘాలు, సభ్యుల సంపూర్ణ వివరాలు నమోదవు తాయి. క్రమబద్ధమైన సమావేశాలు, పొదుపు, అంతర్గత అప్పులు, చెల్లింపులు, పుస్తక నిర్వహణతో సంఘాల బలోపేతంతో పాటు ఆర్థిక స్వావలంబనకు అవకాశం ఉంటుంది. ఎలాంటి అక్రమాలకు అవకాశం ఉండదు.

- రాధమ్మ, మెప్మా ప్రాజెక్టు డెరెక్టర్

మొండి బకాయి రూ.25 వేలు

మించితే ఆస్తుల సీజ్

- నెల్లూరు నగర కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ),జనవరి 21,(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థకు చెల్లించాల్సిన పన్నులకు సంబంధించి రూ.25 వేలకు మించిన మొండి బకాయిలను గుర్తించి వారి ఆస్తులను సీజ్ చేయాలని కమిషనర్ సూర్య తేజ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పన్నుల వసూళ్లపై మంగళవారం ఆయన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. నగరంలో నూటికి నూరుశాతం పన్ను వసూళ్లు జరగాల్సిందే నని తేల్చిచెప్పారు. మొండి బకాయిదారులపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఇంటి యజమాని సకాలంలో పన్నులు చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. నోటీ సులకు స్పందించని వారికి ఆస్తుల స్వాధీనం ఉత్తర్వులివ్వాలని ఆదేశించా రు. అనంతరం ఇందిరా భవన్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. ఆహారం నాణ్యతను పరిశీలించారు. ముందుగా 45,46 డివిజన్లలో పర్యటిం చి పారిశుధ్యాన్ని పరిశీలించారు.

'సోమశిల'లో నీటినిల్వ

అనంతసాగరం జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి మంగళవారం 1,890 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 69.128 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,550, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు తెలిపారు.

గమ్యం చేరకనే ఆగుతున్న ఊపిరి!

- రైళ్లలో పెరుగుతున్న రద్దీ
- జనరల్ బోగీలు చాలక అవస్థలు
- ఉన్నవాటిలోనే ప్రమాదకర ప్రయాణం
- గతేడాది 65 మంది మృత్యువాత



ఓ రైలులో కిక్కిరిసిన బోగీ



ఇలాంటి ప్రయాణం ప్రమాదమే!

రైలు ప్రయాణం సురక్షితమని ప్రచారం చేస్తున్న రైల్వే శాఖ సాధారణ (జనరల్) బోగీల్లో వెళ్లే ప్రయాణికుల భద్రతను మాత్రం గాలికి వదిలేస్తోంది. ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ పేర్లతో నడుస్తున్న రైళ్లకు 20 నుంచి 26 బోగీలు ఉంటున్నాయి. అయితే, వీటిలో జనరల్ ప్రయాణికులకు కేటాయిస్తున్న బోగీల సంఖ్య రెండు లేదా మూడు మాత్రమే ఉంటున్నాయి. మిగిలినవన్నీ రిజర్వేషన్‌కే కేటాయిస్తున్నారు. పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా బోగీల సంఖ్య పెంచక పోవడంతో ఉన్నవాటిలోనే కిక్కిరిసి ప్రయాణించాల్సి వస్తోంది. బోగీల తలుపుల పక్కన నిలబడి ప్రయాణిస్తున్న వారు అనుకోని ప్రమాదాల బారిన పడి ప్రాణాలు వదులుతున్నారు. ఇలా గడిచిన ఏడాది కాలంలో సుమారు 65 మంది దాకా దుర్మరణం చెందగా, ఈ నెల 22 రోజుల్లోనే ఆరుగురు మృతి చెందారు.


- బిట్రగుంట (ఆంధ్రజ్యోతి)

రైలు ప్రయాణికుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నా అందుకు తగ్గట్టుగా రైల్వే అధికారులు బోగీల సంఖ్య పెంచడం లేదు. ముఖ్యంగా రద్దీకి తగ్గట్టు కొన్ని రైళ్లలో బోగీలు పెంచుతున్న అధికారులు పేద, మధ్య తరగతి ప్రయాణికుడి విషయంలో చేతులెత్తేస్తున్నారు. రైలులో బెర్తులు, సీట్ల రిజర్వేషన్ అయిపోయినా వెయిటింగ్ లిస్ట్ పేరుతో రైల్వే అధికారులు టికెట్లను అమ్ముకుంటున్నారు. సాధారణ బోగీల విషయానికి వస్తే లెక్కకు మించి రైలు టికెట్లు విక్రయిస్తున్నారు. ఏవిధంగానైనా గమ్యం చేరాలన్న ఆతృతతో ప్రజలు ప్రమాదాల అంచున ప్రయాణిస్తు న్నారు. కాగా, కోవిడ్ పేరిట ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసిన అధికారులు ఆ తర్వాత వాటిని పునరుద్ధరించ లేదు. తిరిగి ప్రారంభిస్తామని ఇటీవల ప్రకటన చేసినా అవి కాగితాలకే పరిమితం అయ్యాయి.

ఇతర రాష్ట్రాలకు చెందిన వారే..

రైలు ప్రయాణాల్లో ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఉంటున్నారు. దూర ప్రాంతం కావడంతో బస్సు చార్జీలు భరించలేక రైలు ప్రయాణాన్నే ఎంచుకుంటారు. ఉదాహరణకు చెన్నైకు బస్సు చార్జీ రూ.230 ఉండగా, రైలు చార్జీ (జనరల్) రూ.90 ఉంటోంది. అలాగే తిరుపతికి బస్సుకు రూ.190, రైలు చార్జీ రూ.75 ఉంటోంది. విజయవాడ, విశాఖ, హైదరాబాద్, బెంగళూరు వంటి దూరప్రాంతాలకు రైలు చార్జీలకన్నా బస్సు చార్జీ నాలుగైదు రెట్లు అధికంగా ఉంటోంది. దీంతో అత్యధిక శాతం మంది రైలు ప్రయాణాన్నే ఎంచుకుంటున్నారు. దూరప్రాంతాల నుంచి వస్తున్న రైళ్లలో జనరల్ బోగీలన్నీ నిండివున్నా వాటిల్లోనే బిక్కు బిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు.

హెచ్చరిస్తూనే ఉన్నాం!



రైళ్లలో ఫుట్‌పాత్ ప్రయాణం వద్దని మా జీఆర్పీ పోలీసులు హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా, బోగీలు చాలక గమ్యం చేరాలన్న ఉద్దేశంతో ప్రజలు ప్రమాదకర ప్రయాణం చేస్తున్నారు. ప్రయాణి కుల్లో అవగాహన వస్తే తప్ప ఈ సమస్యకు పరిష్కారం దొరకదు.

- కే.భుజంగరావు, నెల్లూరు జీఆర్పీ సీఐ

బిట్రగుంట సెక్షన్ పరిధిలో..

గతేడాది జనవరి నుంచి డిసెంబరు వరకు బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలో 65 మంది మృత్యువాత పడ్డారు. ఇక ఈ ఏడాది జనవరిలో ఇప్పటివరకు ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. వీరిలో అత్యధిక శాతం మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఉండటం గమనార్హం. బోగీల్లో సీట్లు లేక ఫుట్‌పాత్ (రైలు బోగీ ద్వారం) వద్ద కూర్చొని ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సూపర్ ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రద్దీకి చెక్ పెట్టాలంటే ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించడమే మార్గమని నిపుణులు అంటున్నారు. సామాన్య ప్రజానీకం కూడా అదే కోరుకుంటోంది.


మృతుల వివరాలు

నెల	సంఖ్య
జనవరి	6
ఫిబ్రవరి	3
మార్చి	5
ఏప్రెల్	7
మే	5
జూన్	4
జూలై	5
ఆగస్టు	6
సెప్టెంబరు	4
అక్టోబరు	11
నవంబరు	3
డిసెంబరు	6
మొత్తం	65

ఈ ఏడాది జనవరిలో ఇప్పటివరకు ఆరుగురు మృతి చెందారు

నర్సరీల్లో 59 లక్షల మొక్కల పెంపకం : డీఎఫ్‌వో

ఉదయగిరి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అటవీ, సోషల్ ఫారెస్టుల ఆధ్వర్యంలోని నర్సరీల్లో 59 లక్షల మొక్కలు పెంచుతున్నట్లు జిల్లా అటవీ శాఖాధికారి మహబూబ్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం ఉదయగిరి రేంజ్ పరిధిలోని దుత్తలూరు, ఉదయగిరి మండలాల్లో నర్సరీలను, ప్లాంటేషన్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అటవీశాఖ 19లక్షలు, సోషల్ ఫారెస్టు 40 లక్షల మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. జిల్లాలో వనసరంక్షణ సమితుల్లో పెంచిన జామాయిల్ కర్రను త్వరలో కటింగ్ చేస్తామన్నారు. ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో జేకే పేపర్‌మిల్స్ రాయ్‌ఘడ్ వారు టన్ను రూ.8,100లకు దక్కించుకున్నారని పేర్కొన్నారు. దన్నారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజా, డీఆర్వో మురళి, ఎఫ్ఎస్‌వో శ్రీరాములు, ఎఫ్‌బీవోలు వెంకటేశ్వర్లు, ఓంప్రకాష్, లక్ష్మీప్రసన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కావలి రైల్వేస్టేషన్‌లో దట్టంగా అలుముకున్న మంచు



మినీ స్టేడియంలో..

మంచు కప్పేస్తోంది!

జిల్లాను మంచు దుప్పటి కప్పేస్తోంది. ఉదయం 9 గంటల కూడా పొగమంచు ఉండి, చలిగాలులు వీస్తుండటంతో ప్రజానీకం వణికి పోతోంది. వాహన రాక పోకలకూ ఆటంకం ఏర్పడు తోంది. మంగళ వారం ఉదయం 8 గంటలకు కావలి రైల్వే స్టేషన్‌లో కనీసం ట్రాక్ కూడా కనిపించనంతగా మంచు కప్పేసింది. స్టేషన్‌లో రైళ్లు ఆగే వరకు కూడా ఏ బోగీ ఎక్కడుందో కనపడక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఇక మినీ స్టేడియం, జేబీ క్రీడా మైదానంలో వాకింగ్ చేసే వారూ ఇబ్బందులు పడ్డారు. ఇక జాతీయ రహదారిపై లైట్ల వెలుగుల్లో వాహన రాకపోకలు సాగాయి.

- కావలి (ఆంధ్రజ్యోతి)

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు (వ్యవసాయం), జనవరి 21(ఆంధ్రజ్యోతి): పశుపోషకుల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను పశువుల పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధకశాఖ నెల్లూరు వెటర్నరీ పాలీక్లినిక్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టీ సోమయ్య పిలుపునిచ్చారు. నగరంలోని మన్సూర్ నగర్‌లో మంగళవారం పశు ఆరోగ్య శిబిరం జరిగింది. ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు అందించడమేకాక గర్భకోశ వ్యాధితో బాధపడు తున్న పశువులకు చికిత్స, చూలు పశువులకు పరీక్షలు చేయడం, మందులు ఇవ్వడం, అనారో గ్య పశువులకు వైద్యం వంటివి శిబిరంలో అందు బాటులో ఉంటాయన్నారు. కోళ్లకు కొక్కెర వ్యాధి నివారణ టీకాలు వేస్తారని తెలిపారు. ఈనెల 31వతేదీ వరకు ఈ శిబిరాలు కొనసాగుతాయ న్నారు. కార్యక్రమంలో ఏడీకృష్ణమూర్తి, ఎల్‌ఎస్‌ఏ పొదిలి శ్రీనివాసులు, సంచార వాహనం పశువైద్యులు బెల్లంకొండ నవీన్‌కుమార్, పశువైద్య సహాయకులు కే మేఘన పాల్గొన్నారు.



పక్షిరాజా విలాసం

- పల్లె అందాలను మరిపించేలా విహంగాల పెంపకం
- మానసిక ఆనందం కోసం ఇళ్లలో విడుదులు
- ముద్దుపేర్లతో మురుస్తున్న నగరవాసులు

అత్యధికులు పట్టణాలు, నగరాల్లో ఉంటున్నా, పల్లెల్లో ఉన్న అనుభూతిని పొందాలంటే ఇంట్లో మొక్కలుంటేనే సరిపోదు...రకరకాల పక్షులు, అవి చేసే కిచకిచ శబ్దాలు.. వింటేనే ఆ ఆనందాన్ని అనుభవించగలం. నేడు ఎంతో మంది నెల్లూరు నగరవాసులు వింతైన, విచిత్రమైన, అం దమైన వివిధ జాతుల పక్షులను తమ ఇళ్లలో పెంచుకుం టున్నారు. వీటి పుట్టుక విదేశీయమైనా దేశీయంగా పురుడు పోసి ప్రకృతి ప్రియులకు అందుబాటులో ఉంచుతున్నారు. ఇళ్లలో పక్షులను పెంచుకునే వారు వాటిని కుటుంబంలో సభ్యులుగా చేర్చుకుని ముద్దుపేర్ల పిలుస్తూ మురిసిపోతు న్నారు. పక్షుల కోలాహలంతో ఇళ్లంతా సందడి ఉండాలను కునే వారి అభిరుచులు పెరుగుతుండటంతో వాటి విక్రయ కేంద్రాలు నగరంలోనూ విరివిగా విస్తరిస్తున్నాయి.

- నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి)



స్వీటీ... గోల్డీ... చీప్.. సోఫీ... టీస్... గబ్బీ...డార్లింగ్.. లక్కీ... బింగో... సింగర్... ఏంటీ.. ఇవన్నీ ఏమనుకుంటున్నారు..? ఇళ్లలో ముద్దుగా పెంచుకునే పక్షుల పేర్లు. కుటుంబంలో సభ్యులుగా పెంచుకుంటున్న వివిధ జాతుల పక్షులకు ప్రకృతి ప్రియులు ముద్దుగా పెట్టుకున్న పేర్లు. ధర ఎంతైనా ఎవరూ లెక్క చేయడంలేదు. చూడటానికి అందంగా ఉంటే చాలు. కొనేసి ఇంట్లో పెట్టుకుని మురిసిపోతున్నారు. నెల్లూరు నగరంలోని మాగుంటలేఅవుట్, లీలామహల్, బాలాజీనగర్, ట్రంకురోడ్డులోని లస్సీ సెంటరు, వేదాయ పాళెం, సంతపేట ప్రాంతాల్లో దేశ, విదేశాల నుంచి పక్షులను తీసుకువచ్చి విక్రయాలు చేస్తున్నారు. వీటిల్లో ఎక్కువగా ఆఫ్రికా దేశానికి చెందిన జీబ్రా పించెస్ జాతి, ఆఫ్రికా లవ్‌బర్డ్స్ ఆకర్షణీయంగా ఉన్నాయి. గ్రీన్, ఎల్లో, ఎరుపు రంగుల్లో ఇవి లభిస్తున్నారు. ఈ పక్షులు 3 నుంచి 15 ఏళ్ల వరకు జీవించగలవు. జత రూ. 600 నుంచి 2,500ల వరకు ధర ఉంది. చూడటానికి అందంగా ఉంటే ఆఫ్రపికా, జపాన్, సౌత్‌అమెరికా దేశాలకు చెందిన కాక్‌టైల్ పక్షులు 15 ఏళ్ల వరకు జీవించగలవు.ఇవి జత రూ. 3,500 నుంచి రూ. 6 వేల వరకు ఉంది. ఇక అత్యంత ఖరీదైన సంకనూర్ జాతి పక్షులు నార్త్, సౌత్ అమెరికాకు చెందినవి. ఇవి 30 ఏళ్ల వరకు జీవించగలవు. ఈ పక్షి ధర రూ. 15 వేలు ఉండగా జత రూ. 25 వేలకు విక్రయిస్తున్నారు. ఇవి క్యారెట్, బీట్‌రూట్‌ను ఆహారంగా తీసుకుంటాయి. దేశీయంగా లభించేవి లవ్‌బర్డ్స్ 15 గరిష్ఠంగా ఏళ్ల వరకు జీవిస్తాయి. ఎరుపు రంగలో ఉండేవి వీటి జత రూ. 800కు లభిస్తుండగా, మిగిలిన రంగుల్లోవి రూ. 600కు ఇస్తున్నారు.





కొర్రలు, కొత్తిమేర ఆహారం

అందమైన పక్షులను కొనుగోలు చేస్తేనే సరిపోదు. వాటికి ఇష్టమైన కొర్రలు, కొత్తిమేరను ప్రతిరోజు ఆహారంగా ఇవ్వాలి. వీటిని అవి ప్రీతిగా తింటాయి. వీటి పెంపకానికి వినియోగించే బోన్లు రూ. 600 నుంచి రూ. 5 వేల వరకు అందుబాటులో ఉన్నాయి. వీటిని తయారీదారులు వివిధ ఆకృతిల్లో చేసిస్తారు. బోన్లులోనే ఆహారం, నీరు, ఆడుకునేందుకు వస్తువులు, పడుకునేందుకు మెత్తడి పచ్చిగడ్డి, ఇతర బొమ్మలను ఉంచుతారు. వీటిని ఇళ్లలో పక్షుల గూళ్లుగా ఉంచి పల్లెటూరి అనుభూతులను ఆస్వాదిస్తున్నారు. బిజీబిజీగా మారిన నేడు జీవనశైలిలో ఇంటికి రాగానే కాస్త కుటుంబ సభ్యులతో సరదాగా గడుపుతూనే పక్షులతో కాలక్షేపం చేస్తున్నారు. దీంతో మానసిక ప్రశాంతత చేకూరుతుంది.

పెంపకంలో మహిళలే అధికం

ఇళ్లలో పక్షులను పెంచేవారిలో అత్యధిక శాతం మంది మహిళలే ఉన్నారు. వారు ఇళ్లలో ఎక్కువ సమయం గడిపడం, ఓపిక ఎక్కువ కాబట్టి ఇంటిని అందంగా ఉంచుకోవడంతోపాటు పక్షులు, జంతు ప్రపంచాన్ని ఇంట్లో ఉంచుకోవాలన్న ఉద్దేశంతో నివాసాన్నే ప్రకృతి ప్రపంచంగా మలుచుకుంటున్నారు. ఇళ్లలోని పెద్దల దగ్గర నుంచి పిల్లల వరకు మహిళలే ఎక్కువగా పక్షులను పెంచుతూ ముద్దుపేర్లుతో పిలుచుకుంటూ కొత్త అనుభూతులను ఆస్వాదిస్తున్నారు.



పక్షుల పెంపకంతో కొత్త అనుభూతి



ప్రకృతి నుంచి ప్రత్యక్షంగా పొందలేని అనుభూతులను ప్రజలు పక్షుల పెంపకంతో ఇళ్లలోనే పొందు తున్నారు. కొత్త రకాలు ఏవొచ్చినా ఇట్టే పట్టికెళ్లిపోతు న్నారు. నెల్లూరు నగరంలో పక్షుల ప్రేమికులు ఎక్కువగా ఉన్నారు. ధరతో సంబంధం లేకుండా అందమైన పక్షులుంటేచాలు కొనేసుకుంటున్నారు.

- మహమద్ సిరాజ్, పక్షుల విక్రయ కేంద్రం నిర్వాహకుడు

పక్షులను పలుకరిస్తే చెప్పలేని ఫీలింగ్



పక్షులను ఇళ్లలోకి తెచ్చుకుని ముద్దుపేర్లతో పిలుస్తుంటే చెప్పలేని కొత్త ఫీలింగ్ ఉంటుంది. అవి నా ఫ్రెండ్స్‌లాగే అనిపిస్తాయి. కాసేపు మనసారా మాట్లాడుకోవచ్చు. వాటితో ఉన్నంతసేపు నాకు మరో ప్రపంచంలో ఉన్నట్టే ఉంటుంది.

- ఆలియా, పక్షుల పెంపకందారు

హైదరాబాద్ వాసికి కొడుకును అమ్మిన తండ్రి

- స్థానికులు నిలదీయడంతో వెలుగులోకి..



పిడూరి రవి భార్య వెంకమ్మ

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కన్న కొడుకునే హైదరాబాద్‌వాసికి విక్రయించిన ఓ కసాయి తండ్రి ఉదంతమిది. బుచ్చి మండలం మినగల్లు బీసీ కాలనీలో మంగళ వారం వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు.. మినగల్లు బీసీ కాలనీలో ఉంటున్న గిరిజన దంపతులు పిడూరి రవి, వెంకమ్మలకు ముగ్గురు సంతానం. ఏడేళ్ల క్రితం రవి తన పురిటి బిడ్డను కూడా అమ్మేశాడు. తాజాగా మరో కుమారుడు వెంకటేష్ (7)ను హైదరాబాద్ వాసికి విక్రయించాడు. సోమవారం సాయంత్రం హైదరాబాదు నుంచి వచ్చి న ఓ గుర్తుతెలియని వ్యక్తికి కొడుకు వెంకటేష్‌ను రూ.లక్షకు అమ్మేశాడు. అనంతరం రవి కొడుకుతోపాటు సదరు వ్యక్తితో కలిసి హైదరాబాదు వెళ్లాడని స్థానికులు తెలిపారు. అక్కడ వదిలిపెట్టిన తరువాత రూ.లక్ష తీసుకుని వస్తాడని వారు పేర్కొన్నారు. ఇంత జరిగినా వెంకమ్మ మిన్నకుండిపోవడంపై వారు ఆమెను నిలదీశారు. ఇళ్లలో ఎవరూ లేనప్పుడు తమ పిల్లలను కూడా ఇలానే అమ్మేస్తే పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై సర్పంచు పూజిత, సచివాలయ సిబ్బంది, ఐసీడీఎస్, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందనలేదని వారన్నారు. దీంతో ఎంపీడీవో శ్రీహరితోపాటు సీడీపీవోకి ఫోన్ చేసి సమాచారమిచ్చారు. సూపర్‌వైజర్‌ను అప్రమత్తం చేసినట్టు సీడీపీవో జ్యోతి తెలిపారు. బుధవారం కాలనీకి వెళ్లి విచారించి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

అక్రమ నిల్వలపై విజిలెన్స్ దాడులు

- రూ.17.35 లక్షల సిగరెట్లు స్వాధీనం

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి): అక్రమ నిల్వలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించారు. నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేట జీనిగిలవీధిలోని ఓ ఇంటిపై దాడిచేసి అక్రమంగా నిల్వ ఉంచిన రూ.17.35 లక్షల విలువ చేసే సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. మరో గోదాములో లక్షలు విలువ చేసే పాన్ మసాలా, పొగాకు ఉత్పత్తులను గుర్తించారు. బిల్లులను కూడా గోదాము నిర్వాహకుడి నుంచి స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సుభాన్, డీసీటీవో విష్ణురావు, ఏవో యానాది పాల్గొన్నారు.

చీదెళ్లవారి సత్రం భూములు అన్యాక్రాంతం

లోకాయుక్తకు వారసుడి ఫిర్యాదు



చీదెళ్లవారి సత్రంకు చెందిన భూమిలో అక్రమ నిర్మాణాలు

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నవాబుపేటలోని దాదాపు రూ.200 కోట్ల విలువ కలిగిన చీదెళ్లవారి సత్రం భూములు అన్యాక్రాంతం అయ్యాయి. దేవదాయ శాఖ అధికారులు నిర్లక్ష్యం కారణంగా ఆ సత్రం భూములతోపాటు దాత ఆశయాలు ఆవిరయ్యాయి. ఈ వ్యవహారంపై దాత వారసుడు నంబూరు వెంకట సంతోష్‌బాబు లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో వెలుగుచూసింది. చీదెళ్లవారి సత్రంను నిర్మించిన దాత చీదెళ్ల వెంకట రమణయ్య, ఆయన సంతతి నవాబుపేటలోని సర్వే నెం.171లో 3.63 ఎకరాల భూమిని అప్పటి మదరాసు నగరంలో 1422/1875 డాక్యుమెంట్ ద్వారా చీదెళ్లవారి సత్రం పేరిట సదరు ఆస్తిని మద్రాసు నగరంలో రిజిస్టర్ చేశారు. చీదెళ్లవారి సత్రం నిర్మాణంతోపాటు నిర్వహణకు 48 అంకణాల స్థలంలో 16 ఇళ్లను నిర్మించారు. వీటితోపాటు 2.5 ఎకరాలలో కోనేరు, ఫలసాయం అందించే చెట్ల తోటను ఏర్పాటు చేశారు. దాత వీలునామా ప్రకారం తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలలో చీదెళ్లవారి సత్రంలో అన్నదానం జరపాలనే అంశాలను తన ఫిర్యాదులో వెంకట సంతోష్‌బాబు పేర్కొన్నారు. 1975లో దాత ఆస్తులను దేవదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. అయితే, కొంతమంది అధికారులు అవినీతి, నిర్లక్ష్యం, రాజకీయ ఒత్తిళ్లతో చీదెళ్లవారి సత్రం, ఇళ్లు, కోనేరు, తోటను అక్రమార్కులకు పంచేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై దేవదాయ శాఖ, రెవెన్యూ, నగరపాలక సంస్థ తదితర శాఖల అధికారులకు అర్జీలు ఇచ్చినా వారు పట్టించుకోలేదని పేర్కొన్నారు. రూ.200 కోట్లకుపైగా విలువ కలిగిన ఈ ఆస్తులను పరిరక్షించాలని కోరారు.

బుచ్చిలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు ఎప్పటికో!

29 ఏళ్లుగా కార్యకర్తలు, అభిమానుల నిరీక్షణ

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ ఉద్దండులకు నిలయమైన బుచ్చిరెడ్డిపాళెంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు దివంగత నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహం ఏర్పాటు కలగానే మిగులుతోంది. 1982లో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బుచ్చికి చెందిన బెజవాడ పాపిరెడ్డి వ్యవహరించారు. అప్పట్లో బుచ్చి అల్లూరు నియోజకవర్గంలో ఉండగా ఎమ్మెల్యేగా ఆయన (1983) ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత 1985లో సీపీఎం, 1989లో కాంగ్రెస్, 1994లో సీపీఎం అభ్యర్థులు గెలుపొందారు. ఎన్టీఆర్ చనిపోయే నాటికే పాపిరెడ్డి అనారోగ్యానికి గురవడంతో అప్పట్లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు కుదరలేదు. కాగా, 1993లో జరిగిన ఉప ఎన్నికలో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి టీడీపీ తరఫున గెలుపొందారు. 1999లో టీడీపీ నుంచి అల్లూరు ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి గెలుపొందినా ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి కోటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి గెలుపొందారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా బుచ్చి కోవూరు నియోజకవర్గంలో కలిసింది. 2009 ఎన్నికల్లో టీడీపీ తరఫున నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విజయం సాధించారు. ఆ తర్వాత 2012లో జరిగి ఉప ఎన్నికల్లో వైసీపీ తరఫున ప్రసన్న గెలుపొందారు. 2014లో టీడీపీ అభ్యర్థి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి విజయం సాధించారు. 2019లో వైసీపీ, ఆ తర్వాత 2024లో టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపొందారు. ఇలా ఆరుసార్లు టీడీపీ అభ్యర్థులు గెలుపొందినా దివంగత ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు మాత్రం జరగలేదు. పోలంరెడ్డి వారసుడు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా, కోవూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా సారధ్యం వహించినా ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుపై దృష్టి సారించలేకపోయారు. బుచ్చి మండలంలో కొంతమంది టీడీపీ నాయకులు పదవులకోసం ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని ప్రకటనలు గుప్పించినా ఆ తర్వాత ఆ విషయాన్ని అటకెక్కించారు. ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు కోసం కొంతమంది నాయకులు, కార్యకర్తలు చందాలు ఇస్తామని ముందుకొచ్చినా పట్టించుకున్న నాథుడే లేడు. ప్రస్తుతం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అయినా స్పందించి ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు చొరవ చూపాలని నాయకులు, అభిమానులు కోరుతున్నారు.



గీత కులాలకు 18

- వైన్‌షాపులు కేటాయిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు
- అప్పుడే సిండికేట్ వ్యాపారుల ప్రయత్నాలు

ఎన్నికల్లో హామీ మేరకు ఎన్డీఏ కూటమి గీత కులాల వారికి 18 వైన్‌షాపులు కేటాయించింది. అయితే జనాభా ప్రాతిపదికన ఏ మండలానికి ఎన్ని షాపులు కేటాయించాలి అన్న దానిపై కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. గీత కులాల వారికి కేటాయించే వైన్‌షాపులకు లైసెన్స్ ఫీజు సగమే ఉండటంతో ఆ షాపులను దక్కించుకునేందుకు జిల్లావ్యాప్తంగా సిండికేట్ ప్రయత్నాలు ప్రారంభించింది.

నెల్లూరు (క్రైం), జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం గీత కులాలను మూడు కేటగిరీలుగా విభజించింది. ఏ కేటగిరీలో యాత, బీ-కేటగిరీలో గౌడ్, ఈడిగ, గౌడ (గమళ్ల), కలాలీ, గౌండ్ల, శ్రీసాయన, సొండి, శెట్టిబలిజ, సీ-కేటగిరీలో సొండి కులాన్ని విడిగా చూపించారు. గీత కులాల్లోని ఉపకులాల ఆధారంగా జిల్లాలో ఏ ఉపకులాలు ఉన్నాయి. జనాభా ఎంత? అన్న లెక్కలను ఎక్సైజ్ అధికారులు తీస్తున్నారు. మంగళవారం ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం జిల్లాకు 18 షాపులు దక్కనున్నాయి. ఉపకులాల వారీగా గౌడ్‌లకు 6, గౌడలకు 6, గమళ్లకు 4, గౌండ్లకు 1 వైన్‌షాపులకు కేటాయించారు. అయితే, జీవోలో కేటాయించిన షాపుల్లో 17 షాపులే వస్తున్నాయి. ఒక షాపు మిస్ కావడంతో ఎక్సైజ్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇక కేటాయించిన వైన్‌షాపుల్లో గీతకులాల జనాభా ఆధారంగా ఏ మండలాల్లో ఏ ఉపకులానికి ఎన్ని షాపులు కేటాయించాలి అన్న గజిట్‌ను కలెక్టర్ విడుదల చేస్తారు. కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో ఎక్కువగా గీత కులాల వారు ఉన్నట్లు తెలుస్తోంది.

సిండికేట్ల లాబీయింగ్

గీత కులాల వారికి కేటాయించే వైన్‌షాపుల్లో దరఖాస్తు రుసుము రూ.2 లక్షలు ఉండగా, లాటరీ విధానంలో షాపులు దక్కించుకుంటే లైసెన్స్ ఫీజులో సగభాగం చెల్లిస్తే సరిపోతుంది. గతంలో కేటాయించిన సాధారణ వైన్‌షాపులకు నెల్లూరు కార్పొరేషన్‌లో రూ.93 లక్షలు, నెల్లూరు రూరల్‌లో రూ.60.50 లక్షలు, ఇతర ప్రాంతాల్లో రూ.65లక్షలు, రూ.55 లక్షల చొప్పున వార్షిక లైసెన్సు ఫీజులు చెల్లించారు. అయితే గీత కులాలకు కేటాయించే వైన్‌షాపులకు లైసెన్సు ఫీజు సగం మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. దీంతో సిండికేట్‌గా మారిన వ్యాపారులు గీత కులాలకు కేటాయించనున్న 18 వైన్‌షాపులపై కన్ను వేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే నమ్మకంగా ఉన్న గీత కులాల వారితో సంప్రదింపులు చేసి అన్నీ తాము చూసుకుంటామని, కుల సర్టిఫికెట్ ఇచ్చి తమతోపాటు లాటరీ తీసే ప్రాంతానికి వచ్చి సంతకం పెడితే చాలు అంటూ నమ్మబలుకుతున్నారు.

గణతంత్ర వేడుకలకు సందానీ దంపతులు



సందానీ, షాహీన్ దంపతులు

ఉదయగిరి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం ఉదయగిరి దిలావర్ భాయ్ వీధికి చెందిన షేక్ సందానీ, షాహీన్ దంపతులకు దక్కింది. ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకంలో భాగంగా స్థానిక చెక్కనగిషీ కేంద్రంలో 120 మంది కళాకారులు పనిచేస్తున్నారు. వారిలో షేక్ సందానీ, షాహీన్‌లను ఈనెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు హాజరు రావాలని పీఎంవో కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో ఆ దంపతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సాయం చేసేందుకు వెళ్లి
తిరిగిరాని లోకాలకు..

- పంటకాలువలోకి ఆటో బోల్తా
- దానిని తీసేందుకు వెళ్లిన ఇద్దరికి విద్యుత్ షాక్.. మృతి



ఆటో పక్కనే పోలయ్య, శ్రీనివాసులు మృత దేహాలు

దగదర్తి (బిట్రగుంట), జనవరి 21, ఆంధ్రజ్యోతి : బోల్తా పడిన ఆటోను బయటకు తీసేందుకు వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. దగదర్తి మండలం తడకలూరు సమీపంలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తడకలూరుకు చెందిన ఉదయగిరి మనోహర్ పచ్చిగడ్డి తీసుకొచ్చేందుకు గ్రామ శివార్లలోని పొలం వద్దకు ఆటోలో వెళ్లాడు. అయితే, ఆటో అదుపుతప్పి పక్కనేఉన్న పంట కాలువలోకి బోల్తా కొట్టింది. ఈ విషయం తెలుసుకున్న సమీపంలోని గిరిజన కాలనీకి చెందిన పోట్లూరి పోలయ్య (42), మానికల శ్రీనివాసులు (25) పరుగున ఘటనాస్థలికి వెళ్లారు. అయితే, ఆటో బోల్తా పడిన సమయంలో నేలపై ఉన్న మోటారు విద్యుత్ తీగలు తెగిపోయాయి. ఈ విషయం తెలియక పోలయ్య, శ్రీనివాసులు ఆటోను బయటకు లాగే క్రమంలో విద్యుత్ షాక్‌నకు గురై అక్కడికక్కడే మృతిచెందారు. కావలి రూరల్ సీఐ పాపారావు, దగదర్తి ఎస్ఐ జంపాని కుమార్ ఘటనాస్థలిని పరిశీలించారు. మృతదేహాలను కావలికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తొలగని యూరియా కష్టాలు



కలువాయి మండలంలో రైతులకు యూరియా కష్టాలు ఇంకా తొలగిపోవడం లేదు. మంగళవారం యూరియా కోసం సొసైటీ కార్యాలయానికి చాలామంది రైతులు వచ్చారు. అక్కడ 300 బస్తాలు మాత్రమే ఉండటంతో ఎకరాకు బస్తా వంతున ఇచ్చారు. ఇంకా పలువురు రైతులకు యూరియా అందలేదు. సిఫారసు ఉన్న వారికే యూరియా అందుతుందని కొందరు సన్నకారు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని వ్యవసాయాధికారి వీ.ప్రతాప్ దృష్టికి తీసుకుపోగా యూరియా కొరతను ఉన్నాతాధికారుల దృష్టికి కూడా తీసుకుపోయామని, ఒకట్రెండు రోజుల్లో అవసరం మేరకు యూరియా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

- కలువాయి, (ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

పరీక్ష ఫీజు పేరుతో 'ప్రైవేటు' దోపిడీ

- చెల్లించని 'పది' విద్యార్థులకు వేధింపులు

కలువాయి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రైవేటు పాఠశాల యాజమాన్యం పరీక్షల ఫీజు పేరుతో పదోతరగతి విద్యార్థులను దోపిడీ చేస్తోంది. అగిడినంత మొత్తం చెల్లించనివారిని వేధింపులకు గురిచేస్తున్నది. తల్లిదండ్రుల సమాచారం మేరకు వివరాలు...పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల ఫీజు రూ.125 చెల్లించాల్సి ఉంది. అయితే ఆ పాఠశాల యాజమాన్యం నవంబరులో ఒకొక్క విద్యార్థి నుంచి రూ.1200లు వంతున వసూలు చేసింది. ఆ తరువాత డిసెంబరులో మరోసారి తాము పాఠశాలలో నిర్వహించే పరీక్షల కోసమంటూ రూ.1000 వసూలు చేసింది. ఇలా రెండు దఫాలుగా మొత్తం రూ.2,200లు వసూలు చేసింది. అంతటితో ఆగని ఆ పాఠశాల యాజమాన్యం సంక్రాంతి సెలవులు అనంతరం మళ్లీ పరీక్షల ఫీంటూ రూ.2500లు చెల్లించాలని విద్యార్థులను డిమాండ్ చేసింది. సోమవారం సంక్రాంతి సెలవులు అనంతరం పాఠశాలకు వెళ్లిన కొందరు విద్యార్థులు వారడిగిన మొత్తాన్ని చెల్లించారు. అలా చెల్లించని విద్యార్థులను వేధిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల ఫీజు పేరుతో మూడు దఫాలుగా రూ.4700లు వసూలు చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి ఆత్మకూరు డిప్యూటీ డీఈవో జానకిరామ్ దృష్టికి తీసుకుపోగా, ఆ పాఠశాలకు నోటీసు జారీ చేస్తామన్నారు.

తప్పిపోయిన వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగింత

ఏఎస్‌పేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తప్పి పోయిన వ్యక్తిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ సైదులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహరాష్ట్రకి చెందిన విశాల్ పరమేశ్వర జాగ్దే అనే వ్యక్తి మతిస్థిమితం లేకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఈనెల 17న ఏఎస్ పేట దర్గాకు వచ్చారు. ఈ క్రమంలో సోమవారం విశాల్ కనిపించకుండా పోయాడు. దీంతో కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ భాస్కర్‌రెడ్డి, కానిస్టేబుల్ షబ్బీర్ గాలింపు చేపట్టగా, ఆత్మకూ రులో విశాల్ దొరకడంతో అతడ్ని పోలీ స్టేషన్‌కి తీసుకువచ్చి ఎస్ఐ సైదులు సమక్షంలో ఆయన కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వక్ఫ్ బోర్డు స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

ఏఎస్‌పేట,జనవరి21(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు స్థలాలను ఆక్రమిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ ఖుదావన్ తెలిపారు.మంగళవారం ఆయన మండలంలోని శ్రీకొలను గ్రామంలోని ఆసుర్‌ఖానా పీర్లచావిడికి చెందిన 8.10 ఎకరాల భూమిని పరిశీలించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆ స్థలాన్ని చదును చేయడంతో పీర్ల చావిడి భాగస్తులు వక్ఫ్ బోర్డుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇన్‌స్పెక్టర్ ఆ స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. .వక్ఫ్ బోర్డు స్థలాలను కబ్జా చేయాలని ప్రయత్నిస్తే కేసులు పెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీర్ల సావిడి భాగస్తులు ఎండీ షకీల్, సయ్యద్ రఫీ,వలిజాన్, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లపై తనిఖీ బృందం పరిశీలన

అనంతసాగరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో మెడికల్ సర్టిఫికెట్ల ద్వారా నెలకు రూ.15 వేలు పింఛను తీసుకొంటున్న లబ్ధిదారులను తనిఖీ బృందం మంగళవారం పరిశీలించింది. మొత్తం 30 మంది పింఛనుదారులు ఉన్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. పింఛన్లు పొందుతున్నవారు నిజమైన లబ్ధిదారులేనా? అనే అంశంపై వెరిఫికేషన్ చేశారు. వారి ఆధార్, మెడికల్ సర్టిఫికెట్లు పరిశీలించారు. ఈపరిశీలన కార్యక్రమం బుధవారం కూడా ఉంటుందని, నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీం సభ్యులు డాక్టర్లు రమేష్‌కుమార్, మురళిధర్‌రావు, అశోక్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

యథేచ్ఛగా కలప తరలింపు

- హైలెవెల్ కెనాల్ కట్టపై విలువైన చెట్ల నరికివేత
- సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు



చెట్లు నరుకుతున్న కూలీలు



అక్రమంగా తరలి వెళ్తున్న కలప

మర్రిపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కలప వ్యాపారులు నిబంధనలను తుంగలో తొక్కి పొంగూరు రిజర్వాయర్ కట్టపై ఉన్న కలపను కొల్లగొడుతున్నారు. అంతేకాక దాన్ని అక్రమంగా తరలించి రూ. లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని పొంగూరు కండ్రిక వద్ద సోమశిల హైలెవెల్ కెనాల్ రిజర్వాయర్‌కు చుట్టూ నిర్మించిన కట్టపై నాలుగు కిలోమీటర్ల మేర దట్టమైన చెట్లు ఉన్నాయి. వేలం నిర్వహిస్తే పంచాయతీకి ఆదాయం వస్తుంది. కానీ కొందరు అక్రమార్కులు కాసులకు కక్కుర్తి పడి వ్యాపారులకు అప్పగించారు. దీంతో అక్రమార్కులు పేట్రేగి పోయి వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ వారం, పది రోజులుగా జోరుగా చెట్లను నరికేస్తున్నారు. టన్ను కలప రూ.3,500 నుంచి రూ.4వేలకు విక్రయిస్తు న్నారు. అయినా తెలుగుగంగ, రెవెన్యూ, అటవీ సిబ్బంది ఎవరూ పట్టించుకోవటం లేదు. ఇక్కడ నుంచి కలప బొగ్గు బట్టీలకు, పొగాకు బ్యారన్లకు తరలిపోతున్నది. ఇప్పటి కైనా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసు కోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రవాణా కార్మికుల జీవనం అస్తవ్యస్తం

- బీజేపీ అధికారంలోకి వచ్చాకే ఈ దుస్థితి
- ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్

నెల్లూరు (వైద్యం), జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రవాణా రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ ఆందోళన వ్యక్తం చేశారు. రవాణా రంగంలో వస్తున్న మార్పులు - కార్మికులపై ప్రభావం అన్న అంశంపై నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రవాణా రంగంపై విపరీతమైన జరిమానా లు, శిక్షలతో కూడిన నూతన చట్టాలను తీసుకువచ్చిందని ఆరోపించారు. రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లను ప్రధాన కారకులుగా చేసి జీవితకాలం జైల్లో ఉండేవిధంగా హిట్ అండ్ రన్ 106(1)(2) వంటి కఠిన చట్టాలు చేసిందని విమర్శించారు. అంతే కాకుండా ఓలా వంటి ప్రైవేట్ సంస్థలకు అవకాశం కల్పించి కార్మికుల సంపదను కార్పొరేట్ శక్తులు దోచుకునే వాతావరణాన్ని కల్పిస్తోందని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో రాబోయే కాలంలో కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యద ర్శులు ప్రసాద్, అజయ్‌కుమార్, పలు కార్మిక సంఘాల నాయకులు సురేష్, దామోదరరెడ్డి, మాలకొండయ్య, మురళి, శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలు కాపాడాలి

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి ● కలెక్టర్ ఆనంద్



మెగా ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, అధికారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా రోడ్డు భద్రత కమిటీ ల్లోని అధికారులంద రూ సమన్వయంతో పనిచేస్తూ ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టా లని కలెక్టర్ ఓ ఆనంద్ సూచిం చారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగ ణంలో మంగళవారం రోడ్డు భద్రత కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్ష తన జరిగింది. తొలుత జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వివిధ నినాదా లతో ఏర్పాటు చేసిన మెగా ఫ్లెక్సీని కలెక్టర్, నగర కమిషనర్ సూర్యతేజ ఆవిష్కరించారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను డీటీసీ చందర్ వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను అరికట్టడం, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడమే మాసోత్సవాల ప్రధాన లక్ష్యమన్నారు. హైవేపై తరచూ ప్రమాదాలు జరిగే సుమారు 50 ప్రాంతాల్లో జాతీయ రహదారుల శాఖ అధికారులు నివారణ చర్యలు చేపట్టారని చెప్పారు. ఇదేవిధంగా ఆర్‌అండ్‌బీ రహదారులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మూడు నెలల్లో ప్రమాద నివారణ చర్యలు పూర్తి చేయాలని సూచించారు. అలాగే, ఉపాధి హామీ పథకం కింద పల్లెల్లో రహదారుల నిర్మాణానికి ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు బీమా పరిహారం అందించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

పార్కింగ్ కోసం 5 ఎకరాలు

జాతీయ రహదారిపై వాహనదారులకు విశ్రాంతి గదులు, హోటళ్లు, పార్కింగ్ వంటి అన్ని సౌకర్యాలు ఒకేచోట కల్పించేందుకు వెంటనే సుమారు 5 ఎకరాల స్థలం ఎంపిక చేయాలని సర్వే రికార్డుల విభాగం అధికారికి సూచించారు. నగరంలో ప్రైవేటు వాహనాల నిలుపుదలకు హైవే సమీపంలోని శ్రీవేణుగోపాలస్వామి కళాశాలను ఎంపిక చేసినట్లు కలెక్టర్ చెప్పారు. కమిషనర్ సూర్యతేజ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్టు తప్పని సరిగా ధరించేలా అవగాహన కల్పించాలని సూచించారు. నగరంలో సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తికావచ్చిందని, పోలీసు కంట్రోలు రూమ్‌తో వీటిని అనుసంధానిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఆర్డీవోలు శ్రీచందన, సుధాకర్‌రెడ్డి, ఎన్‌హెచ్‌ఏ పీడీ చౌదరి, ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, మున్సిపల్ ఎస్ఈలు గంగాధర్, అశోక్ కుమార్, రామ్మోహన్, మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా దుకాణాల తనిఖీ : రూ.25వేల జరిమానా



ఆక్వా దుకాణంలో స్టాక్‌ను పరిశీలిస్తున్న మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు తదితరులు

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 21(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని పలు ఆక్వా దుకాణాలను మంగళవారం మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎం నాగేశ్వరరావు, టాస్క్‌ఫోర్స్ కమిటీ(టీఎఫ్‌సీ) తనిఖీలు చేశాయి. సాయిరాం ఆక్వా ఫీడ్స్ ఓషనేరియస్ ప్రైవేటు లిమిటెడ్, మహదేవ్ ఎంటర్‌ప్రైసెస్ దుకాణాల్లో అనుమతుల్లేకుండా అమ్మకాలు సాగిస్తున్న ఉత్పత్తులను గుర్తించారు. ఆయా దుకాణాలకు ఆంధ్రప్రదేశ్ ఆక్వా కల్చర్ అథారిటీ అనుమతులు కూడా లేనందున రూ.25వేల అపరాధ రుసుము విధించినట్లు జేడీ నాగేశ్వరరావు తెలిపారు. ఆక్వా సాగులో నిషేధిత యాంటీబయోటిక్స్ వాడకం నివారణలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ తనిఖీల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కీర్తి పవిత్ర, మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు టీ శ్రీనివాసులు, సంజయ్ స్టీఫెన్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రణతి ఫ్లోరా, ఎంపెడా టెక్నికల్ అధికారి స్వదీప్, సీఏఏ ప్రతినిధి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

మోటారు బైక్ బోల్తా : ఒకరి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు



గాయాలపాలైన వెంగయ్య



మృతి చెందిన గోగుల రత్నయ్య (ఫైల్)

ఉదయగిరి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంటపల్లి సమీపంలోని మలుపు వద్ద మంగళవారం మోటార్‌బైక్ అదుపుతప్పి బోల్తాపడగా, ఒకరు మృతిచెందరు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం వివరాల మేరకు.. మండలంలోని సున్నంవారిచింతలకి చెందిన గోగుల రత్నయ్య (40) కుటుంబంతో కలిసి బెంగళూరులో బేల్దారి పని చేసుకుంటుండేవాడు. సంక్రాంతి సెలవులు ముగియడంతో సీతారామపురం కేజీబీవీలో చదువుతున్న చిన్న కుమార్తెను పాఠశాలలో వదిలేందుకు బెంగళూరు నుంచి మంగళవారం సున్నంవారిచింతలకు వచ్చాడు. అనంతరం దుత్తలూరు మండలం వెంకటంపేట ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లేందుకు మామ మంచాల వెంగయ్యతో కలిసి బైక్‌పై బయలుదేరాడు. గానుగపెంటపల్లి గ్రామ వద్దనున్న మలుపు వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డుపక్కనే ఉన్న రాయిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వారిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించడంతో వారు క్షతగాత్రులను చికిత్స కోసం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రత్నయ్య పరిస్థితి విషమంగా ఉండ డంతో నెల్లూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. వెంగయ్య తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రత్నయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నరేంద్రబాబుకు జాతీయ పురస్కారం



పురస్కారం అందుకున్న నరేంద్రబాబు

నెల్లూరు(విద్య), జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని బీవీ నగర్‌లో ఉన్న కేఎన్ఆర్ నగరపాలక ఉన్నత పాఠ శాల తెలుగు ఉపాధ్యాయుడు, ఎన్‌సీసీ అసోసియేట్ ఆఫీసర్ గుండాల నరేంద్ర బాబు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. కళావేదిక వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పొయెట్రీ అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ, బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలోని కౌతా పూర్ణానంద కళావేదికలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు పురస్కారాన్ని అందచేశారు. కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ ఎన్నో తెలుగు పుస్తకాలను రచించడంతో పాటు 500కు పైగా బాలగేయాలను, వెయ్యికిపైగా సామాజిక చైతన్య గీతాలను రచించిన నరేంద్రబాబు పలు వేదికల్లో ప్రశంసలందుకున్నార న్నారు. 2024లో రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య అకాడమీ ఉత్తమ కవి పురస్కారం, 2022లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, 2024-25లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఉత్తమ ఎన్‌సీసీ అధికారి అవార్డు అందుకున్న ఆయన సేవలను గుర్తించి తాము పురస్కారాన్ని అందచేశామని తెలిపారు.



చిత్రకళా ప్రదర్శనను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

ముగిసిన చిత్రకళా ప్రదర్శన

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని పురమందిరం వర్ధమాన సమాజంలో ఏర్పాటు చేసి కలర్స్ ఆఫ్ నెల్లూరు చిత్రకళా ప్రదర్శన మంగళవారం రాత్రి ముగిసింది. నాలుగు రోజులు జరిగిన ఈ ప్రదర్శనను ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, కళాభిమానులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో తిలకించారు. వారందరికీ చిత్రకళాకారులు నెల్లూరు అన్నపూర్ణ, డాక్టర్ అమీర్‌జాన్, సుందర్‌బాబు, దోర్నాల శేషయ్య, శ్రీనాద్, బాలకృష్ణ, సునీత, లక్ష్మీ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	134
లేయర్ లైవ్	88
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264
లేయర్	150

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7666
వెండి కిలో ధర	రూ. 93,200
వెండి ఒక గ్రాము	రూ.96.20

పామాయిల్ వ్యర్థాలపై తనిఖీలు



మట్టినమూనాలు సేకరిస్తున్న పర్యావరణ శాఖ అధికారులు

ముత్తుకూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పామాయిల్ వ్యర్థాలను గ్రామ సమీపంలో పూడుస్తున్నారన్న సమాచారంతో మంగళవారం మండలంలోని ఎగువ బలిజపాలెంలో పర్యావరణ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తమ గ్రామ సమీపంలో ఉన్న బహుళ జాతి కంపెనీవారి పామాయిల్ ఫ్యాక్టరీ వ్యర్థాలను తీసుకొచ్చి సమీప గ్రామాల్లోని నివాసాల మధ్య పూడ్చి వెళ్లిపోతున్నారని చలివేంద్రం గ్రామానికి చెందిన సురేష్ పర్యావరణ శాఖకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ శాఖ ఈఈ అశోక్ తమ సిబ్బందితో కలిసి గ్రామ పరిసర ప్రాంతాల్లో మట్టిని తవ్వించి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామంలో విచారించారు. అర్ధరాత్రి వ్యర్థాలను తీసుకొచ్చి పూడుస్తున్నారని గ్రామస్థులు అధికారులకు తెలిపారు. ఈ కారణంగా అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నామని, భూగర్భ జలాలు సైతం కలుషితమవుతున్నాయని వా పోయారు. అధికారులు మాట్లాడుతూ సేకరించిన మట్టి నమూనాలను విశాఖపట్నం ల్యాబ్‌కు పంపుతామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు ప్రవర్తించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం బుంగే పామాయిల్ ఫ్యాక్టరీలో తనిఖీలు నిర్వహించారు.

25 నుంచి అంతర్జాతీయ కాయిన్స్ ఎక్స్‌పో



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎక్స్‌పో నిర్వాహకులు

నెల్లూరు (హరనాధపురం), జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో ఈనెల 25, 26 తేదీల్లో అంతర్జాతీయ కాయిన్స్ ఎక్స్‌పో-2025 జరగనుంది. నగరంలోని పార్థసారథి నగర్‌లోని సద్గురు సిల్వర్ వోక్స్ పాఠశాలలో నిర్వహించనున్న ఈ ప్రదర్శనకు సంబంధించిన గోడ పత్రికలను కలెక్టర్ ఓ ఆనంద్ మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. పాఠశాల డైరెక్టర్లు షణ్ముగ ఆచారి, వెంకటాద్రి నాయుడు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఎక్స్‌పో వివరాలు తెలియజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో అంత ర్జాతీయ కాయిన్స్ ఎక్స్‌పోను ఉచితంగా నిర్వహించడం అభినందనీయ మన్నారు. జిల్లా వాసులు, విద్యార్థులు దీన్ని వినియోగించుకోవాలని సూచించారు. నిర్వాహకులు మాట్లాడుతూ విజయవాడ శ్రీధర్స్ అకాడమీ సౌజన్యంతో ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని తెలి పారు. ప్రపంచంలోని 25దేశాల కరెన్సీ, అతి చిన్న, పెద్ద నోట్లు, 5 వేల పైచిలుకు నాణేలు, స్టాంప్స్ పురాతన నాణేలు వంటివి ప్రదర్శనలో ఉంటాయని చెప్పారు. ఆపస్మా నాయకులు నేలనూతల శ్రీధర్, కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది కొరత

లింగసముద్రం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది కొరత గత కొన్నేళ్లుగా వేధిస్తోంది. ఈ సమస్యతో ప్రజలకు సకాలంలో పనులు జరక్క ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తహసీల్దారు కార్యాలయంలో మండల సర్వేయరు, రీ సర్వే డీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వలేటివారిపాలెం సర్వేయరు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్‌డీ పోస్టు, అటెండరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎంపీడీఓ శ్రీనివాసులుకు ఇన్‌చార్జి ఈఓఆర్డీగా బాధ్యతలు అప్పగించారు. అలాగే వలేటివారిపాలెం హౌసింగ్ ఏఈ నాగరాజు మండల ఇన్‌చార్జ్ విధులు నిర్వహిస్తున్నారు. ఎంఈఓ-1గా కొండాపురం ఎంఈఓ-1 రవికుమార్‌ను ఇన్‌చార్జిగా ఉన్నారు. బీసీ బాలికల వసతి గృహానికి గత ఐదేళ్లుగా కందుకూరు బీసీ బాలికల వసతిగృహం వార్డెన్, అలాగే స్థానిక బీసీ బాలుర వసతి గృహానికి కావలి వసతి గృహ వార్డెన్‌ను ఇన్‌చార్జిగా ఉన్నారు. సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


లింగసముద్రం తహసీల్దారు కార్యాయం

డ్రోన్ పిచికారితో ప్రయోజనం

కందుకూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): డ్రోన్‌తో పురుగు మందుల పిచికారి చేస్తే రైతులకు ప్రయోజనం ఉంటుందని మండల వ్యవసాయాధికారి రాము తెలిపారు. పొలం పిలుస్తోందిలో భాగంగా మంగళవారం మోపాడు, మాచవరంలో వరిపైరును పరిశీలించి సూచనలిచ్చారు. అనంతరం మాచవరంలో ఎడ్ల శీనారెడ్డి పొలంలో డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారీ చేసే విధానాన్ని పరిశీలించారు. ఎకరం పొలానికి ఐదారు నిమిషాల్లో పిచికారీ పూర్తయినట్లు చెప్పారు.

వాడవాడలా రోడ్డు భద్రతా మాసోత్సవాలు

పోలీసుల ఆధ్వర్యంలో
ర్యాలీలు, మానవహారం


ఉదయగిరి : ర్యాలీ చేపట్టిన ఎస్ఐ శ్రీనివాసులు

● ఉదయగిరి: ఎస్ఐ శ్రీనివాసులు రంగనాయకులస్వామి ఆలయం నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలకేశవులు పాల్గొన్నారు.


● దుత్తలూరులో: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఎస్ఐ ఆదిలక్ష్మి దుత్తలూరు సెంటర్‌లోని 565 జాతీయ రహదారిపై విద్యార్థులతో కలిసి మానహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● ఆత్మకూరు: డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ గంగాధర్ తెలిపారు. రోడ్డు భద్రత మాసోత్సవాలను పురష్కరించుకుని ఆత్మకూరులో ఆటో డ్రైవర్లకు, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ జిలాని పాల్గొన్నారు.

● సంగం: ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ నుంచి విద్యార్థులు జాతీయ రహదారి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం హైవే కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో , ఏఎస్ఐ జలీల్‌ఖాన్, శిఖామణి పాల్గొన్నారు.

● కందుకూరు: టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులతో కలిసి సీఐ వెంకటేశ్వరరావు సర్కిల్ కార్యాలయం వద్ద నుంచి పోస్టాఫీసు సెంటర్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐలు సాంబశివయ్య, మహేంద్రనాయక్, డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు షేక్ షానాజ్‌బేగం, నరేష్‌రాజ ఉన్నారు.


చేజర్ల: మానవహారాన్ని ఏర్పాటు చేసిన విద్యార్థులు


ఆత్మకూరు : అవగాహన కల్పిస్తున్న సీఐ గంగాధర్


కందుకూరు: ర్యాలీలో పాల్గొన్న సీఐ, ఎస్ఐలు


సంగం: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

● చేజర్ల, (ఆంధ్రజ్యోతి): ఎస్ఐ తిరుమలరావు ఆధ్వర్యంలో మంగళవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులతో బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి, మానహారాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఏఎస్‌పేట: ఎస్ఐ సైదులు ఠాగూర్ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. నాగారఖానా సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ రమణరెడ్డి,హెచ్‌ఎం దొరస్వామిరెడ్డి,పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం: ఎస్ఐ మరిదినాయుడు పోలీస్‌స్టేషన్ నుంచి విద్యార్థులతో ర్యాలీగా వచ్చి బస్టాండు సెంటరులో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

పశుపోషకుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

ఆత్మకూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పశుపోషకుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందని జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ రమేష్‌నాయక్ తెలిపారు. అశ్వనీపురంలో మంగళవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ నెల 20నుంచి 31వరకు అన్ని గ్రామాల్లో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ ఎస్ జయచంద్ర, ఈవో డీఎల్‌డీఏ డాక్టర్ శ్రీనివాసరావు, పశు వైద్యాధికారులు డాక్టర్ కృష్ణయాదవ్, డాక్టర్ రసూల్ పాల్గొన్నారు.

● అనంతసాగరం: మంచాలపల్లిలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీ గురు జయంతి మాట్లాడుతూ పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

● చేజర్ల: మడపల్లిలో ఉచిత పశుఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ దూడలకు, పెద్ద పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసి, పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు శ్రీకాంత్, మల్లికార్జున పాల్గొన్నారు.

● బొమ్మరాజుచెరువులో..

వింజమూరు: బొమ్మరాజు చెరువు గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 100కుపైగా పశువులకు చికిత్స చేశారు. 20పైగా పశువులకు చూడి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రఘునాథ్, ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణయ్య, సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ వీరశేఖర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● చుండిలో పశుఆరోగ్య శిబిరం

వలేటివారిపాలెం: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో చుండిలో పశుఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులు, దూడలకు స్థానిక సహాయకులు కేవీ బ్రహ్మయ్య నట్టల నివారణ మందు వేయించారు. పశువులకు చూడు పరీక్షలు, తిరగకట్టిన పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాలకొండ దేవస్థాన మాజీ చైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి, ఎల్ఎస్ఏ అనుపమ, పశువైద్య సిబ్బంది కిరణ్, శ్రీమాణ్, తరుణ్, రమేష్, కొండారెడ్డి పాల్గొన్నారు.

● కొండాపురం: సత్యవోలు పంచాయతీ లింగనపాలెంలో ఉచిత పశు వైద్య వైద్యశిబిరం నిర్వహించారు. శాయిపేట పశువైద్యాధికారి ఎం.మధు పశువులు, దూడలకు నట్టల మందు వేశారు. గొర్రెలకు అమ్మవారు (బొబ్బ) మందులు వేశారు. కార్యక్రమంలో గోరంట్ల శ్రీనివాసులు, మందపల్లి మాధవరావు, దాసరి రాఘవులు, పశువైద్య సిబ్బంది వైఎస్.శేషాద్రి, విజయనరసింహ, శ్రీనివాసులు, ఖ్యాతి పాల్గొన్నారు.

● కందుకూరు: పందలపాడు, పాలూరులో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గేదెలు, దూడలకు డీవార్మింగ్ మందులు, కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లు ఇవ్వటంతో పాటు సాధారణ వ్యాధులకు, గర్భధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యాశాల సహాయసంచాలకులు చంద్రమోహన్, మండల పశు వైద్యాధికారి సుధాకర్, సిబ్బంది ఉన్నారు.


అనంతసాగరం: మందు వేస్తున్న ఏడీ గురుజయంతి


కొండాపురం: ఇంజక్షన్ వేస్తున్న పశువైద్యాధికారి మధు


వీవీపాలెం : చుండిలో గేదెకు మందు వేస్తున్న ఏడీ బ్రహ్మయ్య

మార్చి నెలాఖరుకు లక్ష్యాలను నూరు శాతం అధిగమించాలి

● డ్వామా పీడీ గంగాభవాని

ఉదయగిరి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకానికి సంబంధించి సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను మార్చి నెలాఖరుకు నూరు శాతం అధిగమించాలని డ్వామా పీడీ గంగాభవాని పేర్కొన్నారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి క్లస్టర్ పరిధిలోని ఎనిమిది మండలాలకు చెందిన ఉపాధి హామీ పథకం ఉద్యోగులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించాలన్నారు. ప్రతి బుధవారం నిర్వహించే రివ్యూ సమావేశాల్లో లక్ష్యాల సాధనకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించి ఆదిశగా పయనించాలన్నారు. లక్ష్యాల సాధనలో పురోగతి కనిపించకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జాబ్‌కార్డు ఉన్న ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులకు తప్పనిసరిగా పని కల్పించాలన్నారు. గోకులంషెడ్‌ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం ఉదయగిరిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. ఏపీడీ గాయత్రీదేవి, ఏపీవోలు శ్రీనివాసరావు, సుభాషిణి, ఈసీలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.


ఉపాధి సిబ్బందితో సమీక్షిస్తున్న పీడీ గంగాభవాని

సీపీఎం రాష్ట్ర మహాసభల విజయవంతంపై ప్రచారజాతా

కావలిటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు మంగళవారం పట్టణ బ్రిడ్జి కూడలిలో ప్రజానాట్యమండలి సభ్యులతో ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి సభ్యులు ఆడుతూ పాడుతూ ప్రచారజాత నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడారు. ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో నెల్లూరులో జరుగనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచులయ్య మాట్లాడారు. సభలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుపై చర్చిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు కృష్ణమోహన్, మధుసూదన్‌రావు, మస్తాన్, మాల్యాద్రి, ప్రజా నాట్యమండలి కళాకారులు మోహన్, గోపి, శంకరయ్య, ప్రశాంత్, శ్రీకాంత్, బాష, రమణయ్య పాల్గొన్నారు.

● వలేటిపాలెంకు చేరుకున్న ప్రచారయాత్ర

వలేటివారిపాలెం: ఈ నెల 19వ తేది నెల్లూరు నుంచి ప్రారంభమైన సీపీఎం ప్రచార ర్యాలీ మంగళవారం వలేటివారిపాలెం బస్టాండు సెంటరుకు చేరింది. కార్యక్రమంలో పార్టీ ప్రాంతీయ కమిటీ కార్యదర్శి కుమార్, మాదాల రమణయ్య, దార్ల మాధవరావు, కే. మాలకొండయ్య పాల్గొన్నారు.

● లింగసముద్రం: ఫిబ్రవరి 1, 2, 3 తేదీలో నెల్లూరులో జరిగే సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని నియోజకవర్గ సీపీఎం నాయకులు జీవీబీ కుమార్ కోరారు. మహాసభల ప్రచారంలో భాగంగా జరుగుతున్న ప్రచార జీపు జాత మంగళవారం సాయంత్రం లింగసముద్రం చేరుకుంది. కార్యక్రమంలో నాయకులు మాధవరావు, ఎంవీ రమణ, శ్రీకాంత్, రమణయ్య, వేణు ఉన్నారు.



కావలి: బ్రిడ్జి కూడలిలో ప్రచారజాతా నిర్వహిస్తున్న ప్రజానాట్యమండలి సభ్యులు



వలేటివారిపాలెం: కార్యక్రమంలో మాట్లాడుతున్న కుమార్

లక్కీ డిప్ బహుమతుల ప్రదానం

కావలి, జనవరి (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో అధికారి రామస్వామి సౌజన్యంతో ప్రవేశపెట్టిన లక్కీడిప్ పథకం చేపట్టారు. మంగళవారం ఆర్టీసీ డిపో తీసిన డిప్‌లో ఎంపికైన ముగ్గురు ప్రయాణికులకు విలువైన చీరలు అందచేశారు. కార్యక్రమంలో డీఎం రాపూరు శ్రీనివాసులు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజరు ఎస్‌కే షమీమ్, అసిస్టెంట్ మేనేజరు (ట్రాఫిక్) కల్పనారెడ్డి, ట్రాఫిక్ సూపరింటిండెంట్ రామకృష్ణ, బస్‌స్టేషన్ మేనేజరు రమేష్‌బాబు, రవిప్రకాష్, మోహన్ పాల్గొన్నారు.

చంద్రబాబు కృషితో విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా: ఎమ్మెల్యే

కావలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు కృషితో విశాఖ ఉక్కునకు ఆర్థిక భరోసా లభించిందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడేందుకు రూ.11,440 కోట్ల ఆర్థికప్యాకేజీని ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోద ముద్ర వేయడంపై మంగళవారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విశాఖ ఉక్కు ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కాలంటే రూ.18వేల కోట్లు అవసరమని విశాఖ పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి కుమార్‌స్వామికి టీడీపీ రాష్ట్ర అధ్య క్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ భరత్‌లు విన్నవించిన కొద్ది రోజులకే కేంద్రం నిధులు విడుదల చేయడం హర్షనీయం అన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం

బిట్రగుంట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సహకారంతో ఎస్వీ పీఎం కాలువ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని కావలి కాలువ డిస్ట్రిబ్యూటర్ చైర్మన్ మదుబాబునాయుడు అన్నారు. బోగోలు మండలంలోని కావలి కాలువను నీటి సంఘం అధ్యక్షులు, రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం రెండు లక్షల నిధులతో చేయించే కాలువ పనులను దామవరం ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, నారాయణపురం రైతులతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్వీపీఎం అధ్యక్షులు యర్రం వేంకటేశ్వర్లురెడ్డి, యన్నాబత్తిన రమణయ్య, ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి, మాజీ సర్పంచు గణేషం రమేష్‌రెడ్డి, మహేశ్వర, గోపాలు, పులి మాధవ వేణు ఉన్నారు.

చెత్తాచెదారం తొలగింపు

లింగసముద్రం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత చెరువు అలుగులో పేరుకపోయిన చెత్త కుప్పలను మంగళవారం సర్పంచ్ పులి రాఘవులు ఎక్స్‌కవేటర్ తొలగింపజేశారు. వీరి వెంట ఎంపీడీఓ శ్రీనివాసులు, లింగసముద్రం సాగు నీటి సంఘం అధ్యక్షులు చిన నాగిరెడ్డి, కార్యదర్శి మాధవరావు ఉన్నారు. అలాగే ఆర్యవైశ్యుల శ్మశాన వాటిక, ఎంపీడీఓ కార్యాలయ వద్ద ఉన్న మంచినీటి ట్యాంకు, అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న జంగిల్‌ను తొలగించారు.

న్యూస్ బాక్స్

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

ఉదయగిరి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం సీడీపీవో శారద తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కేంద్రాల నిర్వహణలో సమయపాలన పాటించడంతో పాటు లబ్ధిదారులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సూచనలిచ్చారు.

రేపు విద్యుత్ అదాలత్

అల్లూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అదాలత్‌ను మండలం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పట్టణ విద్యుత్ శాఖ ఏఈ మస్తాన్ షరీఫ్ మంగళవారం ఆయన ఓ ప్రకటనలో కోరారు. ఈనెల 23న అల్లూరులోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారులకు తెలపచ్చని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ దక్షిణప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు హాజరవుతారని తెలిపారు.

3అల్లూరు21 : సింగపేట ఎస్టీ కాలనీలో పర్యటించిన హౌసింగ్ పీడీ వేణుగోపాల్

నిలిచిన ఇళ్ల నిర్మాణాలకు బిల్లుల మంజూరు

అల్లూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ హయాంలో నిలిచిన ఇళ్ల నిర్మాణాల బిల్లులు మంజూరు చేస్తున్నట్లు ఆ వివరాలను లబ్ధిదారులు స్థానిక హౌసింగ్ అధికారులకు అందజేయాలని హౌసింగ్ పీడీ టి.వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం ఆయన సింగపేట గిరిజన కాలనీ పర్యటించి ఇళ్లను పరిశీలించారు. మండలంలో 101 గృహాలు ఉన్నాయని వాటికి సంబంధించిన బిల్లుల విషయాన్ని పరిశీలిచామన్నారు. మార్చి 31 నాటికి గృహాల నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ సిహెచ్. వెంకటేశ్వర్లు, అమర్‌రెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

వంశీధర్‌రెడ్డిని కలిసిన మాలేపాటి


వంశీధర్ రెడ్డిని సన్మానిస్తున్న మాలేపాటి తదితరులు

కొండాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన వంశీధర్ రెడ్డిని మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున పార్టీ జిల్లా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు చల్లా చినమాల కొండయ్య, వింతా గోపాల్, హరిగోపాల్‌రెడ్డి, లెక్కమనేని రాజేష్‌నాయుడు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ ఉత్సవాలు


పోలేరమ్మ ఉత్సవాల్లో కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి తదితరులు

కావలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తాళ్లపాలెం పంచాయతీ లింగంగుంటలో వెలసిన పోలేరమ్మ ఉత్సవాలను మంగళవారం గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా పెట్టి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయకమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు.

29న ఎస్ఆర్ పురం మండల సమావేశం

సీతారామపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఈ నెల 29న మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భాస్కర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశంలో శాఖల వారీగా అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించడంతోపాటు విద్య, తాగునీరు,గృహ నిర్మాణ శాఖ,ఉపాధి హామీ, పారిశుద్యం, సీజనల్ వ్యాధులు అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

వ్యక్తిగత శుభ్రతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలి

● మండల వైద్యురాలు జహారిక



బిట్రగుంట, జనవరి 21, (ఆంధ్ర జ్యోతి) గ్రామాల ప్రజలు వ్యక్తిగత శుభ్రతో పాటు పరిసరాల శుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవని మండల వైద్యురాలు జహారిక తెలిపారు..

? వైరల్ జ్వరాలు ప్రబలడానికి ప్రధాన కారణం.

! మారుతున్న కాలానికి అనుగుణంగా వాతారణంలో మార్పులు వస్తాయని, అందులో ఈ పరిస్థితుల్లో వైరల్ జ్వరాలు వచ్చే అవకాశం ఉంది. మండలంలో జ్వరాల బారిన పడిన వారి సంఖ్య ఎక్కువగా ఉంది.

? జ్వరాల రాకుండా ఏ చర్యలు తీసుకోవాలి.

! ప్రజలు తాగునీటిని వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలి. ఇలా చేయడం కలుషిత నీటిలో వ్యాదులు కలిగించే సూక్ష్మజీవులు మరణిస్తాయి. అప్పటికీ జ్వరాలు తగ్గకపోతే వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు మందులు వేసుకోవాలి.

? ఎలాంటి చికిత్స చేయించుకోవాలి.

! విష జ్వరాల పీడితుల్లో రక్త కణాలు తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఈ సమయంలో శక్తి తగ్గి బలహీనంగా ఉండటం, ఒళ్లు, కాళ్లు, కీళ్ల నొప్పులు వస్తాయి. వైద్యుల సలహాలతో మందులు వాడాలి. సులువుగా అరిగే పౌష్టికాహారం తీసుకోవాలి.

రూ.3.88 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

ఉదయగిరి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పంచాయతీరాజ్ సబ్ డివిజన్ పరిధిలో రూ.3.88 కోట్లతో 43 సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పంచాయతీరాజ్ డీఈఈ మణికుమార్ పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని సీతారామపురానికి రూ.32 లక్షలు, ఉదయగిరి రూ.29 లక్షలు, దుత్తలూరు రూ.37 లక్షలు, వరికుంటపాడు రూ.37లక్షలు, వింజమూరు రూ.38 లక్షలు, కొండాపురం రూ.45 లక్షలు, కలిగిరి రూ.కోటి, జలదంకికి రూ.70 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.

మెగా వైద్యశిబిరం


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

అల్లూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సింగపేటలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వహించే ఆరోగ్యమస్తు కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి నేతృత్వంలో స్థానిక టీడీపీ నాయకుడు బండి అమర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు 300మందికి వైద్యపరీక్షలు చేపట్టారు. అవసరమైన వారికి ఉచిత ఆపరేషన్ల కోసం రెఫర్ చేశారు. కార్యక్రమంలో మల్లూరు సురేష్, ప్రసాద్, పోసిన శ్రీహరి, గంటా కుమార్, సురేష్ పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి జాతీయ పురస్కారం


పురస్కారాన్ని అందుకున్న కనకవల్లి

అల్లూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నార్తుమోపూరు శ్రీచైతన్య విద్యాసంస్థల అధ్యాపకురాలు కనకవల్లికి సావిత్రిబాయిపూలే జాతీయ పురస్కారం లభించినట్లు కళాశాల కరస్పాండెంట్ కె.శివకుమార్ మంగళవారం తెలిపారు. ఈనెల 19న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ఆడిటోరియంలో స్థానిక ఎమ్మెల్సీ కె.యస్.లక్ష్మణరావు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఖాజారం తుల్లాలతో పాటు సిబ్బంది, అధ్యాపకకులు ఆమెను అభినందించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

కలిగిరి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు వ్యవసాయ అధికారులు సూచించే యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లావనరుల కేంద్రం ఏవో శైలజాకుమారి తెలిపారు. మంగళవారం వెలగపాడు రైతు సేవాకేంద్రంలో రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. శనగ పంటలో పలు సూచనలిచ్చారు.

స్పీడ్ బ్రేకర్లకు రంగులు వేయండి



నగరంలో ఎక్కడ పడితే అక్కడ స్పీడ్ బ్రేకర్లు వేస్తున్నారు. వాహనాల వేగాన్ని నియంత్రించేం దుకు వీటిని ఏర్పాటు చేయడం మంచిదే అయినప్పటికీ శాస్త్రీయంగా నిర్మించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు, సైకిలిస్టులు తరచూ ప్రమా దాలకు గురవుతున్నారు. స్పీడ్ బ్రేకర్లు రోడ్డు రంగులో కలిసిపోవడంతో దగ్గరకు వచ్చే వరకు స్పీడ్ బ్రేకర్ ఉన్న విషయం తెలియడం లేదు. ఈ నేపథ్యంలో స్పీడ్ బ్రేకర్లకు రంగులు వేయాలని, అవసరం లేని వాటిని తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రోడ్ క్రాసింగ్‌ల వద్ద జీబ్రా లైన్లు కూడా వేయాలని కోరుతున్నారు.

\- నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి)



కొత్త కంప్యాక్టర్ వచ్చేసింది

నగరంలో చెత్త సేకరణ కార్పొరేషన్‌కు పెద్ద సవాల్. దీనిని అధిగమించాలంటే భారీ యంత్రాలు అవసరం. ఈ నేపథ్యంలో కంప్యాక్టర్ అనే వాహనాన్ని నగర పాలక అధికారులు తెప్పించారు. సేకరించిన చెత్తను ఈ వాహనం ఒకేసారి ఏకంగా 42 టన్నుల వరకు డంపింగ్ యార్డుకు తరలించగలదు. ప్రస్తుతం ఈ యంత్రం పనితీరును ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు. ఫలితాలు చూసి మరిన్ని వాహనాలను తెప్పించేందుకు కసరత్తు చేస్తున్నారు.

\- నెల్లూరు (సిటీ,ఆంధ్రజ్యోతి)



పంచాయతీల్లో పారిశుధ్య పనులు

కోవూరు, జనవరి21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాలతో మంగళవారం కోవూరు నియోజకవర్గ పరిధిలోని పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. అమెరికా నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. పారిశుధ్య పనులపై వెంటనే దృష్టి సారించాల్సిందిగా ఆదేశించారు. డ్రైనేజీ కాలువల్లో చెత్తవేయకుండా గ్రామాల్లో ప్రచారం చేయాలని కోరారు. నిరంతరం ఫాగింగ్ చేసి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో అప్రమత్తమైన కోవూరు పంచాయతీ సిబ్బంది మంగళవారం నుంచే పారిశుధ్య పనులు చేపట్టారు.



రామ్మూర్తి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి

నెల్లూరు(హరనాథపురం), జనవరి 21 : ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఎమ్మెల్సీగా పనిచేసి, విశ్వ బ్రాహ్మణులకు బీసీ కోటా వచ్చేలా చేసిన రావు బహదూర్ గానాల రామ్మూర్తి ఆచారి విగ్రహాన్ని నెల్లూరులో ప్రతిష్ఠించాలని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఖాజన వెంకట శేషయ్య ఆచారి ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో మంగళవారం గానాల రామ్మూర్తి జయంతి జరిగింది. శేషయ్య మాట్లాడుతూ రామ్మూర్తి చలువ వల్లే విశ్వబ్రాహ్మణులు బీసీ కోటాలో అనేక ప్రభుత్వ పథక ఫలాలు పొందుతున్నారన్నారు, ఆయన జయంతిని రాష్ట్ర మంతా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి ఏలూరు బాబుఆచారి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఇలపాక శివప్రసాద్ ఆచారి, పాలూరు చంద్ర ఆచారి, కాకులూరు సురేష్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

● నగరంలో హత్యలు, దాడులు, చోరీలు ● లోపించిన శాంతిభద్రతలు ● పోలీసు స్టేషన్లలో పంచాయితీలు
● సమాంతరంగా నాయకుల స్టేషన్లు ● తలలు పట్టుకుంటున్న అధికారులు ● భయాందోళనలో నగర ప్రజలు

నేరాల నెల్లూరు

ప్రశాంతతకు మారుపేరైన నెల్లూరు నగరం నేరాలకు నిలయంగా మారిపోయింది. నగర పరిధిలో రోజూ ఏదో ఒకచోట హత్య, హత్యాయత్నం, అత్యాచారం, దాడులు, దొంగతనాలు, గంజాయి విక్రయాలు వంటివి జరుగుతూనే ఉన్నాయి. నగరంలో పూర్తిగా శాంతిభద్రతలు లోపించడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు, రాజకీయ నాయకులు రౌడీషీటర్లను పెంచి పోషించడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణాలుగా చెప్పుకోవచ్చు. మరోవైపు పోలీసుల లాఠీలకు రాజకీయ నాయకులు సంకెళ్లు వేస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా పరిస్థితుల్లో పెద్దగా మార్పు రాకపోవడంపై నగరవాసులు పెదవి విరుస్తున్నారు. ఈ నేపథ్యంలో నగర డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సింధుప్రియకు శాంతి భద్రతల పరిరక్షణ పెద్ద సవాలే!.



నెల్లూరు(క్రైం), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ పాలనలో వరుస హత్యలు, హత్యాయత్నాలు, దాడు లు, రౌడీషీటర్లు కత్తులు పట్టుకొని రోడ్లపై తిరుగుతూ బెదిరింపులకు పాల్పడుతూ నగర ప్రజలను భయాందోళనలకు గురిచేశారు. అయితే కూ టమి ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా రౌడీషీటర్ల ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు. అధికార పార్టీ నాయకులు ఈ ప్రభుత్వంలోనూ రౌడీషీటర్లు, అల్లరి మూకలకు అండగా నిలుస్తుండటం పోలీసు అధికారులకు పెద్ద సమస్యగా మారుతోంది. నగరంలో ఆరు పోలీసు స్టేషన్లు ఉండగా, వాటి పరిధిలో అధికార పార్టీ నాయకులు సమాంతర స్టేషన్లు నడుపుతున్నారన్న చర్చ జరుగుతోంది. నగర పరిధిలో ఆకతాయిలు, రౌడీషీటర్లు రెచ్చిపోతున్నారు. రాత్రిపూట మద్యం సేవించి రోడ్లపై షికార్లు చేస్తున్నారు. పోలీసులు అడ్డు కుంటే నాయకుల నుంచి ఫోన్లు చేయిస్తున్నారు. ఇక రౌడీషీటర్లు, పాత ము ద్దాయిలైతే పోలీసు స్టేషన్లలోనే మధ్యస్థాలు చేసే స్థాయికి చేరుకున్నారు.

మధ్యస్థాలకు అడ్డాగా పోలీస్ స్టేషన్‌లు

అన్యాయం చేసిన వారిని శిక్షించి బాధితులకు న్యాయం చేయాల్సిన పోలీసు స్టేషన్లు మధ్యస్థాలకు అడ్డాగా మారుతున్నాయి. గత ప్రభుత్వంలో నాయకులు నేర్పించిన పాఠాలను ఈ ప్రభుత్వంలోనూ నాయకులు పాటిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇరువర్గాలను కూర్చోపెట్టి స్టేషన్లలోనే మధ్యస్థం చేసేస్తున్నారని, సామాన్యులకు న్యాయం జరగడం లేదని ఎందరో బాధితులు ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. ఇదిలా ఉంటే, పోలీసు అధికారులు మాత్రం 'మేము చేసేందుకు ఏముందని.. పై నుంచి ఫోన్లు వస్తే చేసేది ఏమి లేదు' అని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, చివరికి ఉన్నతాధికారులు సైతం తలలు పట్టుకు న్నట్లు తెలిసింది. ఫిర్యాదు స్టేషన్‌కు రాకముందే 'వాళ్లు మనవాళ్లు.. ఏమి చేయకండి' అంటూ అధికారులకు ఫోన్లు అందుతున్నాయి. చివరికి చోరీ కేసుల్లో దొంగను సైతం ఏమీ చేయవద్దని చెప్పే స్థాయికి నాయకులు చేరారని కొందరు పోలీసు అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మంజూరుకు చర్యలు

● ఎమ్మెల్యే సోమిరెడ్డి



ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సోమిరెడ్డి

ముత్తుకూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ముత్తుకూరులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50లక్షల వ్యయంతో నిర్మించిన ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ముత్తుకూరులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అవసరం ఉందన్నారు. అధిక జనాభా కలిగిన ఈ ప్రాంతంలో వైద్య సేవలు అవసరం ఉందన్నారు. ఈ సెంటర్‌కు ఈఎస్‌ఐ కేంద్రం మంజూరు కృషి చేస్తామన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలోని ఆరోగ్యకేంద్రాల్లో రూ.1.95కోట్ల సీఎస్ఆర్ నిధులతో వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు త్వరలోనే ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామన్నారు. వ్యవసాయ కాలువల మరమ్మతుల పేర్లతో కోట్లు దండుకున్న కాకాణి, ఇప్పుడు గ్రామాల్లో రైతులే కాలువలు బాగు చేసుకుంటుంటే తట్టుకోలేక తమపై అర్థం పర్థం లేని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం మత్స్య కళాశాలలో గ్రామ సచివాలయాల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అర్హులందరికీ ఆధార్ కార్డులు, రేషన్‌కార్డులు, ఫించన్లు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సుజాత, మండల వైద్యాధికారి దేవికృప, నాయకులు ఈదూరు రామ్మోహ న్‌రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, నీలం మల్లికార్జున యాదవ్, కొత్తపల్లి రమేష్, మురళీధర్‌రెడ్డి, అబ్దుల్ షఫీ, ఏడుకొండలు పాల్గొన్నారు.

మనుబోలు రోడ్డుకు మరమ్మతులు : బొమ్మి

మనుబోలు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రూ.15లక్షల నిధులతో మనుబోలు ప్రధాన రోడ్డుకు మరమ్మతులు చేపట్టనున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర తెలిపారు. మంగళవారం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి మాట్లాడారు. మనుబోలు ప్రధాన రహదారి దెబ్బతిని ఉందని, బాగుచేయించాలని టీడీపీ నాయకులు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి మెయింటెనెన్స్ గ్రాంటు కింద రూ.15లక్షలు మంజూరు చేయించారన్నారు. కండలేరు కాలవ నుంచి వైఎస్ విగ్రహం వరకు ఎక్కడరోడ్డు దెబ్బతిని ఉందో అక్కడంతా మరమ్మతులు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, దండు చంద్రశేఖర్‌రెడ్డి, సాని వెంకటరమణయ్య, రాయపాటి కిరణ్‌కుమార్, చింతల వెంకటేశ్వర్లు, కలికి బ్రదర్స్ , రాజాగౌడ్, ప్రసాద్, అంకయ్యగౌడ్ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోండి

● నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి



అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(సిటీ),జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలో దోమల బెడద నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ సూర్యతేజతో కలిసి రూరల్ నియోజ కవర్గంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఖాళీ స్థలాల్లోని మురుగులో దోమల లార్వాను నాశనం చేసేందుకు గంబూజియా చేపలను వదలాలని ఆదేశించారు. డ్రైనేజీ కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, నీరు నిల్వ ఉన్న చోట దోమల సంహారక మందులు పిచికారీ చేయాలని సూచించారు. నగరంలో జరుగుతున్న యూజీడీ పనులను వేగంగా పూర్తి చేస్తే చాలా వరకు మురుగు సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. దర్గా వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా చూడాలని కోరారు.

రూ.కోట్లు దోచుకున్న వైసీపీ నేత

● బినామీ పేర్లతో ప్రభుత్వ భూముల స్వాహా
● జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మందిపాటి



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

కొడవలూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ పాలనలో నార్తురాజుపాలెంకు చెందిన ఓ వైసీపీ నాయకుడు రూ. కోట్లు విలువ చేసే గ్రావెల్, ప్రభుత్వ భూములు స్వాహా చేశాడని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మందిపాటి ప్రవీణ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు నార్తురాజుపాలెంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న నార్తురాజుపాలెంలో ఐదెకరాల ప్రభుత్వ భూమిని స్థానిక వైసీపీ నాయకుడు బినామీ పేర్లతో స్వాహా చేశాడని ఆరోపించారు. అలాగే టపాతోపు వద్ద ఓ రొయ్యల కర్మాగారానికి రెండు ఎకరాలు ప్రభుత్వ భూమిని రూ.4కోట్లకు అమ్ముకున్నాడని ఆరోపించారు. గ్రావెల్‌ను ఇతర రాష్ట్రాలకు తరలించి ప్రజాసంపదను దోచుకున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వం భూములు, కాలువలను తిరిగి ప్రభుత్వానికి చెందేలా చర్యలు చేపడతామన్నారు. అక్రమాలు చేసినవారిని టీడీపీ ప్రభుత్వం వదిలిపెట్టదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాటూరు రమేష్, నాపా వెంకటేశ్వర్లునాయుడు, యోగానంద రెడ్డి, కరకటి మల్లికార్జున, కేతు వెంకటరమణారెడ్డి, చెక్క మదన్, తువ్వర ప్రవీణ్, కే సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండేపల్లిలో పశు వైద్య శిబిరం

మనుబోలు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బండేపల్లిలో మంగళవారం పశువైద్యశిబిరం నిర్వహించారు. మడమనూరు పశువైద్యులు మహ్మమద్ షరీఫ్ 159 మేకలు, గొర్రెలు, ఆవులు, పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉడతామస్తానయ్య, ఉడతా రాజేంద్ర, పశువైద్యసిబ్బంది ఇమామ్ బాషా, కల్యాణి, కామాక్షమ్మ, మస్తానయ్య పాల్గొన్నారు.

ఆర్థిక ప్యాకేజీతో విశాఖ ఉక్కుకు పూర్వవైభవం : వేమిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : అప్పుల ఊబిలో కూరుకుపోయిన విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించడం హర్షదాయకమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ ప్యాకేజీతో విశాఖ ఉక్కుకు పూర్వ వైభవం వస్తుందన్నారు. ప్యాకేజీ సాధించి నందుకు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వాన్ని ప్రశంసించారు.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను కాపాడండి

● ఎంపీడీవోకు టీఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు కలగట్ల వినతి



ఎంపీడీవోకి వినతిపత్రం ఇస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

పొదలకూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వినాయకమాన్యం వద్ద వేసిన లే అవుట్‌లోని పార్కు కోసం వదిలిన 160 అంకణాల స్థలాన్ని కొందరు అక్రమార్కుల ఆక్రమించాలని చూస్తున్నారని ఈ విషయంపై తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో నరసింహరావుకు మంగళవారం టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షుడు కలగట్ల సందీప్ వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ గ్రామ సర్వే నెంబరు 201-2, 202-16లో 4ఎకరాల 10సెంట్ల స్థలంలో లే అవుట్ ఏర్పాటు చేసి ఇళ్ల ప్లాట్లు విక్రయించారని మిగిలిన 160 అంకణాల స్థలంలో కొందరు ఆక్రమించి కంచె వేశారని వాపోయారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు బ్రహ్మదేవి చంద్ర, పాలెం శివ, తదితరులు పాల్గొన్నారు.

విధిగా హెల్మెట్ ధరించాలి

● కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి

కోవూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మోటారు బైక్‌లు నడిపేవారు విధిగా హెల్మెట్ ధరించాలని సీఐ సుధాకర్‌రెడ్డి కోరారు. జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయన గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం గంగవరం నుంచి కోవూరు వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ రంగనాథ్‌గౌడ్, గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

● బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి) : యువతీ, యువకులంతా లైసెన్స్‌తో వాహనాలు నడపాలని సీఐ శ్రీనివాసులురెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం బుచ్చిలోని జొన్నవాడ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ. సంతోష్‌రెడ్డి, సిబ్బంది, యువత పాల్గొన్నారు.

రహదారి భద్రత..అందరి బాధ్యత : సీఐ

రాపూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రహదారి భద్రత.. అందరి బాధ్యతని రాపూరు సీఐ చిన్నసత్యనారాయణ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి మూడు రోడ్ల కూడలి వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు విధిగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు రవాణాశాఖ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరాజేష్, ఆర్టీసీ డీఎం అనీల్‌కుమార్, పోలీసు, ఆర్టీసీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

ముత్తుకూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణపట్నం సర్కిల్ సీఐ రవినాయక్ పోలీసు సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించి, ప్రధాన కూడలిలో మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, జాగ్రత్తలపై వాహనదారులకు, ఆటో డ్రైవర్లకు వివరించిన ముత్తుకూరు ఎస్ఐ విశ్వనాధ్‌రెడ్డి, కృష్ణపట్నం పోర్టు ఎస్ఐ శ్రీనివాసరెడ్డిలు వివరించారు.



ముత్తుకూరు ప్రధాన కూడలిలో మానవహారం



కోవూరు : హెల్మెట్లతో గంగవరం నుంచి కోవూరుకు బైక్ ర్యాలీ

రహదారి భద్రత నియమాలు పాటించాలి

పొదలకూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత అందరి బాధ్యత అని, అందరూ భద్రతా నియమాలు పాటించాలని ఎస్ఐ ఎండీ.హనీఫ్ తెలిపారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి సంగం రోడ్డు సర్కిల్ వరకు కాకతీయ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. వాహనాలు నడిపే వారు విధిగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు రవాణాశాఖ ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15వరకు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది షేక్.అక్తర్‌బాషా, షేక్.రఫీ, సురేష్, షరీఫ్ పాల్గొన్నారు.

● తోటపల్లిగూడూరు: ఎస్ఐ వీరేంద్రబాబు స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి ప్రభుత్వ కళాశాల విద్యార్థులు, సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది వాసు, శరత్, కృష్ణ, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నేడు రూరల్ మండల సర్వసభ్య సమావేశం

నెల్లూరు రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మండల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శైలేంద్రకుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలతోపాటు వివిధ శాఖలపై సమీక్ష జరుగుతుందని తెలిపారు. ఎంపీపీ విజయకుమార్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు ఉదయం 10.30 గంటలకు హాజరుకావాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

రాపూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు బుధవారం ఉదయం 10 నుంచి 11గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ అనీల్‌కుమార్ తెలిపారు. రాపూరు ప్రాంత ప్రజలు, ప్రయాణికులు తమ సూచనలు తెలియజేయడానికి 9959225651 నెంబరుకు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

చంద్రబాబు కృషితోనే విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా

నెల్లూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు వల్లే విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా లభించిందని టీడీపీ అధికార ప్రతినిధి సాబీర్‌ఖాన్ తెలిపారు. మంగళవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాకే అభివృద్ధి జరుగుతోందన్నారు. గత ప్రభుత్వంలో జగన్ ఒక్క ప్రయోజనం కూడా సాధించలేకపోయారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగాధర్, రియాజ్ పాల్గొన్నారు.

వ్యంగాస్త్రాలు తగవు : శేఖర్

కొడవలూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్న మహిళా శాసనసభ్యురాలుపై వ్యంగాస్త్రాలు తగదని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జీవీఎస్.శేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బసవయ్యపాలెంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సొంత నిధులతో వీపీఆర్ ట్రస్ట్ పేరుతో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు వ్యంగాస్త్రాలు చేస్తున్నారని తగవన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వెంకటాచలం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మ కాలనీ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. నెల్లూరులోని వనంతోపు సెంటర్‌కు చెందిన కాలేషా ముత్తుకూరు మండలం పంటపాళెం సమీపంలోని కంపెనీలో పని చేస్తున్నాడు. పని ముగించుకొని మోటర్ బైక్‌పై గ్రామానికి వస్తుండగా రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న మలుపు వద్ద ఎదురుగా ఒక్కసారిగా కారు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో కాలేషాకు గాయాలవగా స్థానిక సీహెచ్‌సీకి తరలించారు.

మొగళ్లూరులో పొలం పిలుస్తోంది

పొదలకూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మొగళ్లూరు, వావింటపర్తిలో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఏడీఏ శివనాయక్ పాల్గొని మాట్లాడారు. వరి పంటలో ఎలుకల బెడద నివారణకు రైతులకు వంద శాతం రాయితీతో రాటల్ బ్రోమోడయాలిన్ అనే మందును ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వాసు, ఏడుకొండలు నాయక్, దీప, శ్రీనివాసతేజ, టీడీపీ నాయకులు నెట్టెం పెంచలయ్య, రైతులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఎంపిక

వెంకటాచలం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగే 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను వీక్షించేందుకు విక్రమ సింహపురి యూనివర్సిటీకి చెందిన ఇద్దరు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎంపికయ్యారు. మంగళవారం వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు ఎంపికైన యుగంధర్ (బయో టెక్నాలజీ విభాగం), ఎం.షాలినీ ప్రియా (కెమిస్ట్రీ విభాగం)వలంటీర్లను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, వర్సిటీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హనుమారెడ్డి, ఎన్ఎస్ ఎస్ సమన్వయకర్త ఉదయశంకర్ పాల్గొన్నారు.


111వ సారి రక్తదానం


నెల్లూరు (వైద్యం), జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ అజయ్‌బాబు మంగళవారం 111వసారి రక్తదానం చేశారు. జిల్లాలోనే అత్యధిక సార్లు రక్తదానం చేసిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. నారాయణ ఆసుపత్రిలోని ఓ రోగికి అత్యవసరంగా రక్తం కావాల్సి ఉండటంతో అజయ్ రక్తదానం చేశారు. వ్యాధిగ్రస్తులకు రక్తం అవసరాలు తీర్చేందుకు దాతలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రక్తనిధి వైద్యాధికారి డాక్టర్ వరప్రసాద్, మందుల దుకాణం కన్వీనర్ మురళీకృష్ణ, మహాయాగ హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు పురాణం లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424





రామకుప్పం మండలంలో ఒంటరి ఏనుగు (ఫైల్ ఫొటో)

జిల్లాలో ఏనుగుల సంచారం పెరిగింది. ప్రాణ, పంట నష్టాలకు కారణమవుతున్నాయి. శనివారం రాత్రి చంద్రగిరి మండలం శేషాపురం సమీపంలో ఉప సర్పంచి రాకేష్‌చౌదరిని తొక్కి చంపేశాయి. ఈ క్రమంలో ఏనుగుల గుంపు వచ్చినప్పుడు ఏం చేయాలి? ఏం చేయకూడదు? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అనే వివరాలను అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ సెల్వం 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

- మంగళం, ఆంధ్రజ్యోతి

భాకరాపేట, పనపాకం రేంజ్‌లో 15 గజరాజుల సంచారం

'ఆంధ్రజ్యోతి'తో సీసీఎఫ్ సెల్వం





కుప్పం ప్రాంతంలో ఏనుగులు (ఫైల్ ఫొటో)

ఒంటరి.. పిల్లలున్న ఏనుగులను

తరమొద్దు

భాకరాపేట, పనబాకం రేంజ్ పరిధిలో 15 ఏనుగుల గుంపు సంచరిస్తోంది. ఆహారం కోసం శేషాచల అటవీ సమీప పంట పొలాల్లోకి వస్తున్నాయి. ఏనుగులు పిల్లలకు జన్మనిచ్చినప్పుడు.. ఒంటరిగా ఉన్నప్పుడు చాలా ఆవేశంగా ఉంటాయి. చిన్న అలికిడికీ అవి చాలా తీవ్రంగా స్పందిస్తాయి. ఈ పరిస్థితుల్లో వీటిని తరిమే సాహసం చేయొద్దు. వాటికి 500 మీటర్ల దూరంలో ఉండాలి. అప్పుడే అవి దాడికి ప్రయత్నించినా తప్పించుకునే అవకాశాలుంటాయి. అంతకుమించి తక్కువ దూరంలో ఉంటే ఏనుగులు అతివేగంగా పరిగెత్తి దాడి చేయొచ్చు. ఏనుగులు ఉన్నప్పుడు జనం గుంపులుగా ఉండకూడదు. ఆ సమయంలో అవి దాడికి ప్రయత్నిస్తే తప్పించునే క్రమంలో ఒకరిని ఒకరు తోసుకోవడంతో కిందపడి.. ఏనుగులు బారినపడి ప్రాణాలు కోల్పోయే అవకాశాలున్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఏనుగులు తిరుగుతున్నాయని తెలిస్తే సాయంత్రం ఆరు నుంచి తెల్లవారుజాము వరకు ఆ వైపు వెళ్లకుండా ఉండటం మంచిది. రాత్రిపూట ఏనుగులు పంట పొలాల్లో ప్రజలను చూసినప్పుడు కనపడకుండా, శబ్దం చేయకుండా పక్కనే ఉంటాయి. పగటిపూటా ఇలాగే చెట్టు చాటున దాక్కుంటే సమీపానికి వెళ్లేంత వరకు వాటిని చూడలేం. రాత్రిపూట ఏనుగులు పంట పొలాల్లోకి వస్తే ఆ సమయంలో అక్కడికి వెళ్లేవారు డార్క్ కలర్ దుస్తులు వేసుకోవాలి. తెల్లరంగు, ఏనుగులకు వెలుతురుగా కనిపించే రంగు వేసుకోకూడదు. ఏనుగులను తప్పెట్లు, టపాకాయలు పేల్చి బలవంతంగా అటవీ ప్రాంతంలోకి పంపిస్తే అవి తిరిగి పంట పొలాల్లోకి వచ్చి ఎక్కువ నష్టం కలుగజేస్తాయి. వీటి పరిస్థితిని అర్థం చేసుకున్న అటవీశాఖ అధికారులు మాత్రమే ఏనుగుల గుంపును అడవిలోకి పంపడానికి ప్రయత్నిస్తారు. ఏనుగుల సమాచారంతో పాటు అవగాహన పెంచుకునేందుకు అటవీ సమీప గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నాం.

అటవీశాఖ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

కుంకీ ఏనుగుల ద్వారా ఏనుగులను తిరిగి అడవుల్లోకి పంపడానికి 30 మంది అటవీశాఖ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. ననియాల వద్ద రెండు కుంకీ ఏనుగులు ఉన్నాయి. కర్ణాటక నుంచి మరో నాలుగు తెప్పించే ప్రయత్నం చేస్తున్నాం.

నష్టపరిహారం పెంపు.. సత్వరం అందజేత

2024 జూన్‌లో ప్రభుత్వం నష్టపరిహారాన్ని పెంచింది. ఏనుగుల దాడిలో చనిపోయిన వ్యక్తులకు గతంలో నష్టపరిహారం రూ.5 లక్షలుంటే ఇప్పుడు రూ.10 లక్షలకు పెంచారు. అదీ 24 గంటల్లోనే అందజేస్తున్నారు. తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.80 వేల నుంచి రూ.2 లక్షలకు పెంచగా.. స్వల్పంగా గాయపడ్డ వారికి రూ.25వేలు ఇస్తున్నారు. ఎకరా వరి పంటకు రూ.8వేల నుంచి రూ.10వేలకు, చెరకు పంటకు రూ.12వేలు, ఒక కొబ్బరి చెట్టుకు రూ.2వేలు, అరటిచెట్లకు ఎకరాలో నష్టాన్ని బట్టి రూ.24వేల చొప్పున.. వారం రోజుల్లోనే నష్టపరిహారం అందిస్తున్నారు.

ఏనుగులు కనపడ్డాయంటే..

ఎవరికైనా ఏనుగులు కనిపిస్తే 1800 4255909 టోల్ ఫ్రీ నెంబరుకు లేదా ఆ ప్రాంత అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.



ఒకప్పుడు మన జిల్లా

ఉద్యమాల ఖిల్లా!

- 6లో

ఉదయం పెళ్లి పీటలపై..
సాయంత్రం ఉరితాడుకు వేలాడుతూ..

● ఆంబాకంలో నవ వధువు బలవన్మరణం



సత్యవేడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాళ్ల పారాణి ఆరలేదు. నుదుట భాసికం తీయనేలేదు. తలపై వేసిన అక్షతలు రాలనే లేదు. మంగళ వాయిద్యాల సందడి సద్దుమణగనే లేదు. పెళ్లి పీటలెక్కి గంటలైనా గడవ లేదు.. అంతలోనే ఆ వధువు అనంతలోకాలకు తరలి వెళ్లింది. ఉదయం పెళ్లి జరగ్గా.. సాయంత్రానికి బలవన్మరణానికి పాల్పడింది. సత్యవేడు మండలం ఆంబాకంలో సోమవారం సాయంత్రం ఈ విషాద ఘటన జరిగింది. ఎస్‌ఐ రామస్వామి తెలిపిన ప్రకారం.. ఆంబాకానికి చెందిన ధనుంజయ, రది దంపతుల కుమార్తె ఆర్తి(20) చెన్నైలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. అదే గ్రామానికి చెందిన మేనమామ సూర్యతో ఈమెకు వివాహం నిశ్చయమైంది. ఊతుకోటలో సోమవారం వీరిద్దరి వివాహం జరిపించారు. అటునుంచే వధూవరులు తిరుత్తణి ఆలయానికి వెళ్లారు. మధ్యాహ్నం వరుడు సూర్య ఇంటికి వచ్చారు. తనకు అలసటగా ఉందంటూ నిద్ర పోయేందుకు బెడ్‌రూంలోకి వెళ్లిన ఆర్తి తలుపులు వేసుకుంది. సాయంత్రం అవుతున్నా బయటకు రాలేదు. ఎంత పిలిచినా పలకలేదు. కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి గడియ పగులకొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉంది. వెంటనే ఆమెను ఊతుకోటలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రామస్వామి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పెళ్లయిన గంటల్లోనే పెళ్లికూతురు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

భార్య అరుణతో..



మావోయిస్టు
చలపతి

తవణంపల్లె మండలం మత్యంపైపల్లె వాసి

మదనపల్లె పట్టుశాఖలో పూర్వ ఉద్యోగి

సెంట్రల్ కమిటీ దాకా ఎదిగిన చలపతి అలియాస్ రామచంద్రారెడ్డి గారి ప్రతాప్ రెడ్డి పై జిల్లాలో చర్చ

మన జిల్లా వాడే!



ఛత్తీస్‌గఢ్ అడవుల్లో చలపతి మృతదేహం

చిత్తూరు అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఒడిశా-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని గరియా బంద్ జిల్లా కులారిఘాట్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన చలపతి అలియాస్ రామచంద్రారెడ్డి గారి ప్రతాప్‌రెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లావాసి అని తెలియడంతో జిల్లాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. జిల్లా నుంచి ఇంకా ఇంత పెద్ద నాయకుడు మావోయిస్టుల్లో ఉన్నాడా అని అందరూ ఆశ్చర్యపోతున్నారు. చలపతి స్వస్థలం అయిన తవణంపల్లె మండలం మత్యంపైపల్లె గ్రామంలో అయితే ఏ వివరాలు చెబితే ఏమవుతుందో అని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. చలపతికి తమ ఊరికి అసలు సంబంధమే లేదని చెబుతున్నారు. ఈయన అన్న కుమారుడు ఒకరు ఇప్పటికీ గ్రామంలో ఉన్నారు. మరో అన్న మదనపల్లె పట్టుపరిశ్రమ శాఖలో పనిచేస్తున్నారు. అయితే బంధుత్వాలు చెప్పుకోవడానికి వీరు ఇష్టపడడం లేదు. చలపతి తల్లిదండ్రులు మరణించారు. ఆయనకు ఇద్దరు అన్నలని ఒకరు మరణించగా మరొకరు ప్రభుత్వ ఉద్యోగి అని సమాచారం.

ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి.. : చలపతి మదనపల్లెలో పట్టుశాఖలో పనిచేస్తూ విశాఖ జిల్లాకు బదిలీ అయ్యారని, అక్కడి పరిచయాలే ఆయనను మావోయిస్టుగా మార్చాయని తెలుస్తోంది. ఉద్యోగాన్ని సైతం వదిలేసి అజ్ఞాత జీవితాన్ని ఎంచుకున్నారని, ఆ ప్రాంతానికే చెందిన మావోయిస్టు నాయకురాలు అరుణతో ఆయనకు పెళ్లి కూడా అయ్యిందని అంటున్నారు.

ఎన్నోసార్లు తప్పించుకుని.. : గతంలో అనేక సందర్భాల్లో ఎదురుకాల్పుల్లో తప్పించుకున్న చలపతి ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో బలైపోయారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల పోలీసులతో పాటు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది దాదాపు వెయ్యి మందికి పైగా కలిసి చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో మరణించిన 20 మంది మావోయిస్టులలో ఆయన ఒకడయ్యారు.

70 ఏళ్ల కిందటే ఊరొదిలేశారు

చలపతి పుట్టకముందే వారి తల్లిదండ్రులు మత్యం పైపల్లె గ్రామాన్ని వదిలి వెళ్లిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. చలపతి తండ్రి, తాత పుట్టింది ఇక్కడే అని, 70 ఏళ్ల కిందటే అప్పట్లో ఉన్న పూరి గుడిసె, ఉన్న కొద్దిపాటి స్థలాన్ని అమ్ముకుని గ్రామాన్ని వదిలి వెళ్ళిపోయారని, దాంతో వారికి ఈ గ్రామంతో ఎలాంటి సంబంధం లేదని స్థానికులు చెబుతున్నారు.

గొప్ప వ్యూహకర్త

అంకితభావం గల గెరిల్లాగా చలపతి మావోయిస్టు పార్టీలో అగ్రనాయకుడిగా ఎదిగారు. మంచి వ్యూహకర్త గా ఆ పార్టీలో పేరు తెచ్చుకున్నారు. 2003లో అప్పటి సీఎం చంద్రబాబు మీద అలిపిరి వద్ద నక్సల్స్ చేసిన దాడిలోనూ చలపతి పాత్ర ఉందని పోలీసులు భావించారు. 2018లో టీడీపీ అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోములను కాల్చిచంపిన ఘటనలోనూ చలపతి సూత్రధారి అని తెలుస్తోంది. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన చలపతి ఒడిస్సా రాష్ట్ర మావోయిస్టు కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఇప్పటికే ఇతడిపై రూ.కోటి రివార్డును కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈయనను హతమార్చినందుకు కేంద్ర హోం మంత్రి ఎక్స్ వేదికగా బలగాలను అభినందించారు కూడా. ఇంత కీలకమైన మావోయిస్టు నాయకుడు జిల్లాకు చెందినవాడు కావడం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

విధేయతకు పట్టం

● బీజేపీ జిల్లా సారథిగా సామంచి



సామంచిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు



తిరుపతి, జనవరి21(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడుగా సామంచి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. తిరుపతిలో మంగళవారం జరిగిన బీజేపీ అధ్యక్ష ఎన్నికల్లో సామంచిని ఆ పార్టీ ప్రముఖుల సమక్షంలో ఎన్నికల అధికారి పి.సురేందర్‌రెడ్డి ప్రకటించారు. విద్యార్థి దశ నుంచే ఆర్‌ఎస్‌ఎస్ (రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్)చేరిన సామంచి తనదైన గుర్తింపు తెచ్చుకున్నారు. 1989 నుంచి 99వరకు నగర కార్యదర్శిగా, జిల్లా కన్వీనర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పదేళ్ల పాటు వివిధ హోదాల్లో పనిచేశారు. 1999లో బీజేపీలో చేరిన ఆయన క్షేత్రస్థాయి నుంచి వివిధ హోదాల్లో చురుగ్గా వ్యవహరించారు. తాజాగా రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉంటూ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. సుదీర్ఘకాలం పార్టీకి సేవలందించినప్పటికీ అధికారిక పదవులు దక్కలేదని ఏనాడూ అసంతృప్తిచెందని వ్యక్తిగా సామంచికి మంచి పేరుంది. అతడి విధేయతను గుర్తించిన అధిష్ఠానం జిల్లా బాధ్యతలను అప్పగించినట్లు పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ప్రతి ఇంటికీ బీజేపీ నా లక్ష్యం

జిల్లాలో పార్టీ విస్తరణే లక్ష్యంగా కార్యకర్తలను కలుపుకొని ప్రతి ఇంటికీ వెళ్తానని నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అన్నారు. కూటమి అధికారంలోకి రావడానికి బీజేపీ కార్యకర్తల కృషి, పట్టుదల ఉందన్నారు. అభివృద్ధే నినాదంతో తిరుపతిలో నిధులు వెచ్చిస్తున్న బీజేపీ అదే స్థాయిలో పార్టీని బలపరచుకోవడానికి అందరం కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. సభ్యత్వ నమోదులో తిరుపతి మూడో స్థానం సాధించడంపై కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ సిద్ధాంతాలు, కార్యకర్తల క్రమశిక్షణకే పెద్దపీట వేసి బూత్‌స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు అందరి అభిప్రాయాల మేరకు ఎన్నికలు జరుగుతాయనే విషయాన్ని గుర్తించాలన్నారు. అనంతరం నేతలు, కార్యకర్తలు సామంచి శ్రీనివాస్‌ను సత్కరించారు. ఒక పని చేయడానికి బాధ్యతలు తీసుకుంటే సరిపోదని బాధ్యతతో పనిచేస్తేనే ఆ పనిలో వందశాతం విజయం సాధించగలమని జిల్లా ఎన్నికల అధికారి సురేంద్రరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కోలా ఆనంద్, మట్టా ప్రసాద్, మాజీ అధ్యక్షుడు చంద్రప్ప, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, కండ్రిగ ఉమా, ఎస్‌ఎస్‌ఆర్ నాయుడు, రాటకొండ విశ్వనాథ్, సుబ్రహ్మణ్యం యాదవ్, పొనగంటి భాస్కర్, అజయ్‌కుమార్, వరప్రసాద్, పెనుబాల చంద్రశేఖర్, బీడీ బాలాజీ, వెంకటముని, డాక్టర్ శ్రీహరిరావు, జిల్లానుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

24న నూతన ఎస్పీ బాధ్యతల స్వీకరణ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా నియమితులైన హర్షవర్ధనరాజు ఈ నెల 24న బాధ్యతలు స్వీకరించనున్నారు. గురువారం సాయంత్రం తిరుపతికి చేరుకుని అక్కడ నుంచి తిరుమలకు వెళ్ళి శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు తీసుకోనున్నారు.

24న స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కాలేజీ నిర్వహిస్తున్న ఫార్మసీ డిప్లొమో కోర్సులో ప్రవేశానికి ఈ నెల 24 వ తేదీ స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఇంటర్‌లో ఎంపీసీ కానీ, బైపీసీ కానీ పూర్తి చేసిన వారు అర్హులు. ఆసక్తి కలిగిన వారు 23వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వం నిర్ణయించిన కోర్సు ఫీజుతో విద్యార్థినులకు ఉచిత హాస్టల్ వసతి కల్పించనున్నారు. మరింత సమాచారం కోసం 92990 08151 నెంబరులో సంప్రదించవచ్చు.

ఎస్వీయూలో చిరుత!

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలోని హెచ్-బ్లాక్ హాస్టల్ సమీపంలో మంగళవారం రాత్రి చిరుత సంచరించినట్టు తెలిసింది. దీంతో భయాందోళన నెలకొంది. ఇప్పటికే విద్యార్థులు, ఉద్యోగులను అధికారులు అప్రమత్తం చేశారు. చిరుత సంచారం నేపథ్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. రాత్రి 7 నుంచీ ఉదయం 7 గంటల మధ్య విద్యార్థులు, ఉద్యోగులు సంచరించకూడదని సూచించారు. వర్సిటీలో ఎక్కువగా ఉన్న కుక్కల కోసం చిరుత వస్తున్నట్టు ఫారెస్టు అధికారులు తెలిపారు. అందుకని కుక్కలు పట్టించేలా వర్సిటీ అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

డాడీతో సినిమాకి టైం ఉంది

● హీరో ఆకాష్ పూరి



తిరుమల, జనవరి21(ఆంధ్రజ్యోతి): తన తండ్రి పూరి జగన్నాథ్‌తో సినిమా చేయడానికి ఇంకా టైం ఉందని హీరో ఆకాష్ పూరి తెలిపారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ, చాలా రోజుల తర్వాత అద్భుతమైన శ్రీవారి దర్శనం లభించిందన్నారు. త్వరలో 'తల్వార్' సినిమా చేయబోతున్నట్టు తెలిపారు. ఈ సినిమా షూటింగ్ జనవరి నెలాఖరులో ప్రారంభమవుతుందన్నారు. అందుకే స్వామి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చానన్నారు. ఇక, తన తండ్రి దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ కథ రాస్తున్నారని, ఎవరు హీరో అనేది ఇంకా ఫిక్స్ కాలేదని ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

శ్రీవారి సేవలో గాయని మంగ్లీ

తిరుమల, జనవరి21 (ఆంధ్రజ్యోతి):గాయని మంగ్లీ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి ఆమె మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.



విజయశ్రీ, మంగ్లీ

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం : రూ.3.59 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 83,806

తలనీలాలు సమర్పించినవారు: 23,352

ప్రచారం లేకున్నా... పక్షుల పండుగ సూపర్ హిట్!





అన్నీ తానై వ్యవహరించిన జిల్లా కలెక్టర్

స్థానిక ఎమ్మెల్యేతో సమన్వయం

తడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సమయం లేదు... ప్రచారం అంతకన్నా లేదు... మధ్యలో కొన్ని ఆటంకాలు... అయినా ఇంతపెద్ద పండుగను విజయవంతం చేయగలిగారు అధికారులు. ఉమ్మడి నెల్లూరుజిల్లాలో 2001లో ప్రారంభమైన పక్షుల పండుగను 2020 దాక నిర్వహించారు. జగన్ ప్రభుత్వం ఒక ఏడాది మొక్కుబడిగా నిర్వహించి నాలుగేళ్ల చేతులెత్తేసింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే మళ్లీ పక్షుల పండుగను ఘనంగా నిర్వహించాలనే నిర్ణయం తీసుకుంది. తిరుపతి జిల్లా ఏర్పడ్డాక తొలిసారి ఈ పండుగ నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధపడింది. ఏర్పాట్లు మొదలయ్యే సమయంలో వైకుంఠ ఏకాదశి టోకెన్ల క్యూలో తొక్కిసలాట సంఘటన కుదిపేసింది. జిల్లా అధికారులంతా దానిమీద దృష్టి పెట్టాల్సివచ్చింది. ఈలోగా సంక్రాంతి పండుగ దినాలు వచ్చేశాయి. పాఠశాలలకు సెలవులు కావడంతో విద్యార్థులు పండుగకు రారనే అనుమానం ఏర్పడింది. పక్షుల పండుగ తేదీలను అప్పటికే మార్చినందున మరోసారి మార్చేందుకు సిద్ధపడలేదు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం ఉన్న అతి కొద్దిరోజులలోనే రాత్రి, పగలు తేడా లేకుండా పక్షుల పండుగ ఏర్పాట్లను పూర్తిచేయడం విశేషం. ఈ హడావుడిలో ప్రచారం కూడా పెద్దగా చేయలేకపోయారు. తొలిరోజు సమావేశానికి మంత్రి కందుల దుర్గేష్ హాజరయ్యారు. సమావేశం జనం లేక వెలవెలబోయింది.రాజకీయ ప్రత్యర్థులు అధికార కూటమిపై విఫలం అంటూ విమర్శల దాడి మొదలు పెట్టారు. వీరికి తోడు వాన కూడా కురిసి ప్రధాన ప్రాంగణం బురదమయం అయ్యింది. అయినా అధికార యంత్రాంగం వెనకడుగు వేయలేదు. ఆగమేఘాలపై మైదానం సిద్ధం చేశారు. ఆకట్టుకునేలా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. దీంతో శనివారం మధ్యాహ్నం నుంచి తండోపతండాలుగా జనం రావడం మొదలుపెట్టారు. రెండవరోజు ఆదివారం కావడంతో కుటుంబాలతో సందర్శకులు పోటెత్తారు. నేలపట్టు, అటకానితిప్ప, సూళ్లూరుపేట, భీములవారిపాళెం పడవలరేవు ఉదయం నుంచే జనంతో కిటకిటలాడిపోయాయి. సాయంత్రానికి ఆ రద్దీ మూడింతలైంది. భద్రత దృష్ట్యా పడవకి పదిమందినే అనుమతించడం, అందరికీ లైఫ్ జాకెట్లు ఉండేలా శ్రద్ధ తీసుకోవడం, తాత్కాలిక ప్లాట్ ఫారాలు ఏర్పాటు చేసి నేరుగా పడవలోకి ఎక్కేలా చూడడం వంటి చర్యల వల్ల చిన్న సంఘటన కూడా జరగలేదు.



అటకానితిప్ప వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ (ఫైల్ ఫోటో)

సాంస్కృతిక కార్యక్రమాలు హైలెట్

సాంస్కృతిక కార్యక్రమాలు ఈ ఏడాది విశేషంగా ఆకట్టుకున్నాయి. సినీ కళాకారులు రావడంతో జనం పెద్ద సంఖ్యలో మూడు రోజులూ వచ్చారు. సూళ్లూరుపేట కళాశాల మైదానంతోపాటు దాని చుట్టుపక్కల రోడ్లు అన్ని కిటకిటలాడాయి. మూడవరోజున సోమవారం అర్ధరాత్రి వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగినా జనం కదలకుండా తిలకించసాగారు.

పోలీసుల సేవలు భేష్

తిరుపతి దుర్ఘటన నేపథ్యంలో పోలీసులు తగిన ఏర్పాట్లు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలకు జనం పోటెత్తి వచ్చినా చిన్న సంఘటన కూడా జరగకుండా నియంత్రించారు. కళాశాల మెయిన్ గేట్ వద్ద ఆదివారం కొంత తోపులాట జరగడంతో అప్రమత్తమై నిమిషాలలోనే పరిస్థితి అదుపులోకి తీసుకువచ్చారు.

కలెక్టర్.. ఎమ్మెల్యే ఎనలేని కృషి

పండుగ విజయానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీలు సమన్వయంతో కృషి చేశారు. ఎక్కడ సమస్య తలెత్తినా అప్పటికప్పుడు పరిష్కారదిశగా చర్యలు తీసుకున్నారు.

ఇవీ లోపాలు..

- ఇంత భారీ ఎత్తున జరిగిన కార్యక్రమాలకు అనేక ప్రాంతాల నుంచి జనం వస్తారని అంచనా ఉన్నా తగినన్ని బస్సులను ఏర్పాటు చేయలేకపోయారు.
- నేలపట్టులో, అటకానితిప్పలో వేదికలు ఏర్పాటు చేసినా ఆకట్టుకునే కార్యక్రమాలను నిర్వహించలేకపోయారు.
- బీవీపాలెం పడవల రేవులో పడవకు పది మందిని మాత్రమే అనుమతించడంతో జనం గంటలకు గంటలు ఎదురు చూడాల్సి వచ్చింది. ఇంకా ఎక్కువ పడవలను ఏర్పాటు చేసి ఉండాల్సింది.
- వివిధ ప్రాంతాల్లో ముందస్తు ప్రచారం జరగలేదు. కేవలం ఒక పత్రికలో చిన్న ప్రకటనతో సరిపెట్టుకున్నారు. సోషల్ మీడియాను కూడా తగినంతగా వినియోగించుకోలేదు.

నలుగురు స్మార్ట్ ఫోన్ దొంగల అరెస్టు

● 50 సెల్‌ఫోన్ల స్వాధీనం

● నిందితుల్లో బాలుడు ● బోస్టన్ స్కూల్‌కు తరలింపు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

శ్రీకాళహస్తి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌ఫోన్లను టార్గెట్‌గా చేసుకుని చోరీ చేసే బాలుడి సహా మరో ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి తెలిపిన ప్రకారం.. కర్నూలు జిల్లా డోన్ పట్టణం శివరాంపేటకు చెందిన వెంకటసాయి(22) హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఉంటూ కూలీ పనులు చేసుకునేవాడు. డోన్‌లోని శ్రీరామ్‌నగర్ ప్రాంతానికి చెందిన మురళి(37) కూడా హైదరాబాద్‌లో కీసరలో కూలీ పనులు చేస్తుంటాడు. అనంతపురం జిల్లా బుక్కరాయ సముద్రం మండలం ఎల్‌బీ కాలనీకి చెందిన సాయిశివ(29) ప్రైవేటు పనులు చేస్తుండేవాడు. ఈ ముగ్గురు కలిసి ఈజీమనీ కోసం స్మార్ట్‌ఫోన్లను చోరీ చేస్తుండేవారు. వీరికి హైదరాబాద్ నగరం ఎల్‌బీనగర్‌కు చెందిన 12 ఏళ్ల బాలుడు తోడయ్యాడు. ఈక్రమంలో శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో పట్టణ శివార్లలోని నంది కూడలి వద్ద మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. పోలీసులను గమనించిన ఓ కారు వేగంగా వెళ్లిపోతుండగా అడ్డుకున్నారు. కారులోని వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసుల విచారణలో అంతర్రాష్ట్ర స్మార్ట్‌ఫోన్ దొంగలుగా తేలింది. వారి నుంచి 50 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బాలుడిని బోస్టన్ స్కూల్‌కు తరలించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి ముగ్గురు యువకుల అరెస్టు చూపారు. నిందితులను రిమాండుకు తరలించారు.

ఒకప్పుడు మన జిల్లా ఉద్యమాల ఖిల్లా!

భూస్వాముల హత్యలు.. నక్సల్స్ ఎన్‌కౌంటర్లతో అట్టుడికిన చరిత్ర

చలపతి ఎన్‌కౌంటర్‌తో జిల్లాలో ముగిసిన మావోయిస్టు అధ్యాయం



తిరుపతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల్లో మంగళవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి అలియాస్ చలపతి మృతి చెందడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నక్సల్స్ పరంగా ఓ అధ్యాయం ముగిసినట్టయింది. జిల్లా నుంచీ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో సభ్యుడుగా ఎదిగిన ఏకైక నక్సల్‌గా ఆయన గుర్తింపు పొందారు. నక్సల్ ఉద్యమంలో జిల్లాకు సంబంధించినంతవరకూ ఆయన చివరి వ్యక్తి. జిల్లా వామపక్ష తీవ్రవాద చరిత్రలో రామచంద్రారెడ్డి అలియాస్ చలపతి మరణంతో ఓ అధ్యాయం ముగిసినట్టయింది. 1970ల నుంచీ 2003 వరకూ సుమారు మూడు దశాబ్దాల పాటు జిల్లాలో రాడికల్, రైతు కూలీ సంఘం, నక్సల్ తదితర పేర్లతో మావోయిస్టు ఉద్యమం ఉధృతంగా సాగింది. ప్రస్తుత తరానికి పెద్దగా తెలియని ఆ ఉద్యమ కాలాన్ని అప్పటివారు చలపతి ఎన్‌కౌంటర్‌తో ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు.

ఎస్వీయూలో పురుడు పోసుకున్న రాడికల్స్

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించినంతవరకూ 1970వ దశకంలో రాడికల్ విద్యార్థి సంఘం పేరిట తీవ్రవాద వామపక్ష భావజాలమున్న ఉద్యమం మొదలైంది. తిరుపతిలోని ఎస్వీయూ నుంచీ ప్రారంభమైన ఈ విద్యార్థి సంఘం శాఖలు వేగంగా జిల్లా అంతటా వ్యాపించాయి. ముఖ్యంగా పడమటి ప్రాంతమైన మదనపల్లె, వాయల్పాడు, పీలేరు, తంబళ్లపల్లె, పుంగనూరు తదితర ప్రాంతాల్లో ఆర్ఎస్‌యూ బలంగా వేళ్లానుకుంది. సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు ఎక్కువగా ఈ సంఘం వైపు ఆకర్షితులయ్యారు. అలాగే సోమల, చౌడేపల్లె, కలికిరి ప్రాంతాల్లో మెజారిటీ దళిత వాడల యువకులు యూనియన్‌లో చేరి చురుగ్గా పనిచేశారు. ఓ దశలో మదనపల్లెలోని ప్రభుత్వ మోడల్ పాలిటెక్నిక్ ఆర్ఎస్‌యూకు కేంద్ర స్థానంగా మారింది. తరచూ రాడికల్ విద్యార్థులు, ఏబీవీపీ విద్యార్థుల నడుమ ఘర్షణలు తలెత్తేవి. ఆ నేపథ్యంలో ఇరువైపులా హత్యలు, ప్రతీకార హత్యలు కూడా జరిగాయి. కాగా రాడికల్ యూత్ లీగ్ పేరిట యువజన విభాగం కూడా చాలా చురుగ్గా పనిచేసింది. ఈ సంఘాల్లో జిల్లా నుంచీ పలువురు కీలక నేతలుగా ఎదిగారు. సూరిశెట్టి సుధాకర్ ఆర్ఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసి అటు తర్వాత రాష్ట్ర కార్యదర్శిగా రెండు సార్లు వ్యవహరించారు. పోలీసులకు పట్టుబడి విడుదలయ్యాక 1980లలో ఉద్యమం నుంచీ వెలుపలికి వచ్చేశారు. తిరుపతి ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి చంద్రశేఖర్ జిల్లా అధ్యక్షుడుగా పనిచేశారు. మల్లిక్ అనే నేత సైతం తిరుపతిలో కీలకంగా పనిచేశారు. ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి ప్రభాకర్ 1990లలో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు.

దళాలతో పీపుల్స్‌వార్

మావోయిస్టు పార్టీలో చీలక సంభవించి కొండపల్లి సీతారామయ్య వర్గం నుంచి వేరుపడి పీపుల్స్ వార్ గ్రూప్ ఏర్పాటు అయ్యింది. 1980,90 దశకాల్లో పీపుల్స్‌వార్ గ్రూపు కార్యకలాపాలు జిల్లాలో ఉధృతంగా సాగాయి. పాపాఘ్ని దళం, తలకోన దళం, కాళంగి దళం వంటి పేర్లతో నక్సల్స్ జోరుగా కార్యకలాపాలు నడిపారు.

● వాయల్పాడు పంచాయతీ సమితి మాజీ అధ్యక్షుడు చాకిరేవుపల్లి మల్‌రెడ్డిని కలికిరి క్రాస్ రోడ్డులో నక్సలైట్లు బాంబులు వేసి కొడవళ్ళతో దాడి చేసి చంపారు. ● వాయల్పాడు మండలం గొల్లపల్లిలో మజ్జిగ వెంకటేశు అనే మోతుబరి రైతుకు కాళ్ళు నరికేశారు.

● పెద్ద పంజాణి పోలీసు స్టేషన్‌పై నక్సలైట్లు దాడి చేసి తుపాకులు ఎత్తుకుని పరారైన ఘటన జిల్లాను కుదిపేసింది. ● వాయల్పాడు మండలం చింతపర్తి రైల్వే స్టేషన్‌ను డిటొనేటర్లు పెట్టి పేల్చేశారు.

● కలకడ మండలం కదిరాయచెరువులో టెలిఫోన్ ఎక్స్ఛేంజీని సైతం పేల్చేశారు. ● కంభంవారిపల్లి, ఎర్రావారిపాలెం మండలాల్లో ఎంతోమంది భూస్వాములు, మోతుబరి రైతుల ఇళ్ళు, ఆస్తులు పేల్చేశారు. ఎంతోమందిపై దాడులు చేశారు.

మరణించిన నక్సల్స్

- తంబళ్ళపల్లి మండలం డేగావారిపల్లికి చెందిన పీపుల్స్ వార్ నేత వేమనారాయణరెడ్డి అనంతపురం జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు.
- అదే మండలం దబ్బులగుట్టపల్లికి చెందిన నక్సలైట్ వెంకట్రమణారెడ్డి వరంగల్ జిల్లా ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు.
- పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన ఉమ్మడి జిల్లా పీపుల్స్ వార్ కార్యదర్శి మంగలి కృష్ణప్ప అలియాస్ రెడ్డెప్ప, ఆయన భార్య లక్ష్మి, ఆయన తమ్ముడు వెంకటస్వామి ముగ్గురూ కలకడ మండల సరిహద్దుల్లోని గుట్టపల్లి వద్ద 1995లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు.
- ఐరాల మండలానికి చెందిన నక్సల్ నేత మహదేవరెడ్డి కూడా జిల్లాలోనే ఎన్‌కౌంటర్ అయ్యారు.
- శ్రీకాళహస్తి ప్రాంతానికి చెందిన భూపతి అలియాస్ మార్కండేయులు నేతృత్వంలో చురుగ్గా పనిచేసిన కాళంగి దళం మొత్తం ఎన్‌కౌంటర్‌లో తుడిచిపెట్టుకుపోయింది. కాళంగి ప్రాజెక్టు సమీపంలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మృతి చెందారు.
- కంభంవారిపల్లి, ఎర్రావారిపాలెం మండలాల సరిహద్దుల్లోని శేషాచల అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కూడా ఐదుగురు నక్సలైట్లు చనిపోయారు.
- పీలేరు శివార్లలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అనంతపురం జిల్లా నక్సలైట్ నాయకుడు ఎర్ర శీను మృతి చెందారు.
- పెద్దమండ్యం మండలం కనమలోల్లపల్లి వద్ద చాకిబండ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మహిళా నక్సలైట్ సహా నలుగురు చనిపోయారు.
- తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ విద్యార్థి చలపతి ఆర్మీకి ఎంపికై శిక్షణ మధ్యలో తిరిగి వచ్చేసి పీపుల్స్ వార్‌లో చేరారు. క్రమంగా యాక్షన్ కమిటీ సభ్యుడిగా ఎదిగారు. అరెస్టు అయి జైల్లోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు.

అలిపిరి దాడితో అంతం

సీఎం చంద్రబాబుపై 2003 అక్టోబరులో అలిపిరి వద్ద నక్సలైట్లు క్లైమోర్ మైన్ పేల్చి హత్యాయత్నానికి పాల్పడడం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఆ దాడి నుంచీ చంద్రబాబు తృటిలో తప్పించుకున్నారు. ఆ ఘటనతో రాష్ట్ర వ్యాప్తంగా నక్సల్ కార్యకలాపాలపై నిర్బంధం తీవ్రతరమైంది. 2004లో ఏర్పడిన వైఎస్ ప్రభుత్వం సైతం అదే పంథా కొనసాగించడంతో క్రమంగా జిల్లాలో నక్సల్ కార్యకలాపాలు తగ్గుముఖం పడుతూ వచ్చి గత రెండు దశాబ్దాలుగా దాదాపు ఆగిపోయాయి.

పశ్చిమాన సంచలనం రైతు కూలీ ఉద్యమం

పీలేరు, మదనపల్లె, తంబళ్ళపల్లె, వాయల్పాడు, పుంగనూరు ప్రాంతాల్లో తలెత్తిన రైతు కూలీ సంఘం భూస్వాములను బెంబేలెత్తించింది. పలువురు భూస్వాములను రైతు కూలీ సంఘ ఉద్యమకారులు హతమార్చారు. ప్రతీకార దాడుల్లో పలువురు ఉద్యమకారులూ ప్రాణాలు పోగొట్టుకున్నారు.

- 1983 సెప్టెంబరులో మదనపల్లె సొసైటీ కాలనీలో తంబళ్లపల్లెకి చెందిన పోస్టాఫీసు రెడ్డెప్పరెడ్డిని ఉద్యమకారులు హత్య చేశారు. ఆయన అప్పట్లో పేరుమోసిన భూస్వాములైన టీఎన్ కుటుంబీకులకు అనుచరుడుగా వుండేవారు.
- 1984 డిసెంబరు 24న ములకలచెరువు మండలం చౌడసముద్రంలో భూస్వామి పుట్టా వెంకట్రమణను రైతు కూలీ సంఘం కార్యకర్తలు బస్సులోనే తుపాకులతో కాల్చి చంపారు. ఆయన రైతు కూలీ సంఘానికి వ్యతిరేకంగా భూస్వాములను ఏకం చేసి రైతు సంఘం పేరిట కార్యకలాపాలు సాగించిన వ్యక్తి.
- అదే రోజు అర్ధరాత్రి చౌడసముద్రం సమీపంలో ప్రతీకార దాడిలో మాజీ ఎమ్మెల్సీ ఏవీ ఉమాశంకర్‌రెడ్డి హత్యకు గురయ్యారు. ఆయన మాజీ ఎమ్మెల్యే ఏవీ లక్ష్మీదేవమ్మ భర్త.
- మదనపల్లె మల్లికార్జున థియేటర్ సమీపంలో తంబళ్ళపల్లి మండలం అన్నగారిపల్లికి చెందిన భూస్వామి నరసింహారెడ్డిని ఉద్యమకారులు బాంబులేసి కత్తులతో పొడిచి చంపారు.
- ములకలచెరువు మండలం చౌడసముద్రం పంచాయతీ రెడ్డెంవారిపల్లి సిద్ధారెడ్డి కూడా ఇంటివద్దే ఉద్యమకారుల చేతుల్లో హత్యకు గురయ్యారు.
- ములకలచెరువు మండలం గుత్తావారిపల్లిలో భూస్వామి శివయ్య, అతని మరో ఇద్దరు సన్నిహితులు మొత్తం ముగ్గురు హత్యకు గురయ్యారు.
- దీనికి ప్రతీకారంగా రైతు కూలీ సంఘం నేత నాగిరెడ్డి బస్సు ఎక్కుతుండగా ప్రత్యర్థులు కత్తులతో నరికి చంపారు.
- తంబళ్ళపల్లి మండలం బురుజులో రైతుకూలీ సంఘం నాయకుడు రామిరెడ్డిని ప్రత్యర్థులు గొంతు కోసి చంపారు.
- తంబళ్ళపల్లి పోలీసు స్టేషన్ పక్కనే నివాసమున్న రైతు సంఘం నేత నూకల సుబ్బన్నను ఉద్యమకారులు ఆయన ఇంట్లోనే హత్య చేశారు.

25న సుభాష్ పాలేకర్ రాక



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్ శనివారం తిరుపతికి రానున్నారు. ఆయన పర్యటన వివరాలను ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు మంగళవారం మీడియాకు వెల్లడించారు. ఈనెల 25న ఎస్వీయూలోని శ్రీనివాసా ఆడిటోరియంలో వెయ్యి మంది విద్యార్థులకు.. 28న వెయ్యి మంది రైతులకు ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పిస్తారని చెపారు. ఈ సభకు అతిథులుగా మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు పాల్గొంటారన్నారు. వర్డ్ ప్రతినిధి డాక్టర్ గంగాధర్, బోటనీ అధ్యాపకుడు వేణు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, కల్చరల్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. కాగా, 27న పద్మావతి మహిళా యూనివర్సిటీ ఆడిటోరియంలోనూ అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు.

'మహా' మోసం

● కుంభమేళాలో సౌకర్యాలు కల్పిస్తామంటూ రూ.3.65 లక్షలు కాజేసిన నిందితులు

● బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 21(ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళాలో సౌకర్యాలు కల్పిస్తామంటూ రూ.3.65 లక్షలు కాజేశారు. బాధితుడు, న్యాయవాది సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్వీ యూనివర్శిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రామయ్య తెలిపిన ప్రకారం.. తిరుపతి నగరం గాయత్రినగర్‌కు చెందిన న్యాయవాది సుబ్రహ్మణ్యం నేతృత్వంలో 27 మంది కుంభమేళాకు వెళ్లాలనుకున్నారు. అక్కడ కాటేజీలు, భోజన సౌకర్యం తదితరాలు కల్పించే వారికోసం వెబ్‌సైట్‌లో చూశారు. ఇక్కడ అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామంటూ ఉత్తరాదికి చెందిన కొందరు వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. వీరిని నమ్మిన తిరుపతివాసులు మూడు అకౌంట్ల ద్వారా వారి బ్యాంకు ఖాతాలకు రూ.3.65 లక్షలు పంపారు. ఆ తర్వాత 27 మంది కుంభమేళాకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. అయితే, డబ్బులు పంపాక వారిని సంప్రదించడానికి ప్రయత్నిస్తే వారి సెల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్ లేదా తాత్కాలికంగా పనిచేయడంలేదని వచ్చింది. రెండు రోజులు పాటు వీరు ఫోన్లలో ప్రయత్నిస్తూనే ఉన్నారు. చివరకు మంగళవారం ఎస్వీయూ స్టేషన్‌లో బాధితుల తరఫున న్యాయవాది సుబ్రహ్మణ్యం ఫిర్యాదు చేశారు. సీఐ రామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలిపిరిలో కట్టుదిట్టంగా తనిఖీలు

తిరుమల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తిరుమల నుంచి ఎర్రచందనాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో విజిలెన్స్, ఫారెస్ట్ సిబ్బంది అలిపిరి వద్ద నిఘా పెట్టారు. మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తిరుమల నుంచి తిరుపతికి చేరుకున్న తర్వాత కూడా వాహనాలు ఆపి తనిఖీలు చేయడంతో పలువురు భక్తులు ఏం జరిగిందో తెలియక కంగారుపడ్డారు.



టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ నెలవల తదితరులు

నాయుడుపేట టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో మంది ఆంధ్రులు పోరాటాలు, త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను గత వైసీపీ ప్రభుత్వం నష్టాల ఊబిలో కూరుకునేలా చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషితో కేంద్రం విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని కేటాయించడం శుభపరిణామమన్నారు. అలాగే పోలవరం నిర్మాణానికి రూ12వేల కోట్ల నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై రూ.10 లక్షల కోట్ల ఆర్థిక భారం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంచి కృష్ణయ్య, పసల గంగాప్రసాద్, చక్రపాణి, ప్రసాద్‌నాయుడు, అవధానం సుధీర్, నానాబాల సుబ్బారావు, బిరదవాడ నారాయణ, రవి, తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో క్రీడలు భాగం కావాలి



విజేతలకు నగదు, షీల్డ్ అందచేస్తున్న సుబ్రహ్మణ్యం

డక్కిలి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జీవితంలో క్రీడలు ఓ భాగంగా ఉండాలని, అప్పుడే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని విశ్రాంత ఉపాధ్యాయుడు పునుగోటి సుబ్రహ్మణ్యం అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా డక్కిలి మండలం లింగసముద్రం గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ముగిశాయి. మంగళవారం నిర్వహించిన ఫైనల్స్‌లో లింగసముద్రం జట్టుపై డక్కిలి జట్టు విజయం సాధించింది. విజేతలకు పునుగోటి సుబ్రహ్మణ్యం తన సొంత నిధుల నుంచి రూ.70 వేల నగదు బహుమతి, షీల్డ్‌ని అందచేశారు. అలాగే రన్నర్‌గా నిలిచిన లింగసముద్రం జట్టుకు రూ.30 వేల నగదు బహుమతి గ్రామస్తులు అందించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తాను ఇక్కడ ఉపాధ్యాయుడుగా పనిచేసే సమయంలో క్రీడల్లో యువతను ప్రోత్రహించడం వల్ల గత 25 సంవత్సరాలుగా ఏటా సంక్రాంతి సందర్భంగా క్రికెట్ పోటీల నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

గంగ కాలువకు గండి



గంగకాలువకు గండిపడటంతో వృథాగా పోతున్న నీరు

కోట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కోట మండలం ఊనుగుంటపాళెం వద్ద తెలుగుగంగ కాలువకు మంగళవారం గండిపడింది. గత మూడు రోజుల నుంచి వెంకటగిరి మండలం ఊట్లపల్లి నుంచి 5వ బ్రాంచ్ కెనాల్ ద్వారా 250 క్యూసెక్కుల కండలేరు జలాలు కోట మండలం కొండుగుంట మీదుగా చిట్టేడులోని అత్తిమిట్ట చెరువుకు వెళ్తున్నాయి. కాలువలో ప్రవాహం ఓవర్‌ఫ్లో అవడంతో నీళ్లన్నీ తాటిచెరువు కింద ఉన్న ఆయకట్టు పొలాల్లోకి ప్రవహించడంతో సుమారు 30 ఎకరాల్లో వెన్నుదశలో ఉన్న వరి పంటలు నేలవాలిపోయాయి. దీంతో తెలుగుగంగ ఇన్‌చార్జి ఏఈ నిరంజన్‌కుమార్ ఆధ్వర్యంలో గండిని పూడ్చివేశారు.

అంగన్‌వాడీ పిల్లలకు ఆధార్ నమోదు



పిల్లలకు ఆధార్ సీడింగ్ చేయిస్తున్న సీడీపీవో షంషాద్ బేగం

వెంకటగిరి టౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలని సీడీపీవో షంషాద్ బేగంగా ఆదేశించారు. మంగళవారం స్థానిక సీహెచ్‌సీలో ఆధార్ కేంద్రం వద్ద పిల్లలకు ఆధార్ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు తల్లిదండ్రుల ద్వారా ఆధార్ నమోదు చేయించాలని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సర్వీస్ ప్రొవైడర్స్ క్యాంపునకు విశేష స్పందన



కార్యక్రమంలో మాట్లాడుతున్న మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పెంచలయ్య

గూడూరు అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మెప్మా, హోమ్ ట్రైయాంగిల్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సర్వీస్ ప్రొవైడర్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. బ్యూటీషియన్, ఎలక్ట్రీషియన్, కంప్యూటర్, ప్లంబర్, టెలివిజన్, ఏసీ, రిఫ్రిజిరేటర్ తదితర మెకానిక్ కోర్సులలో శిక్షణ కోసం అభ్యర్థనలు అందాయి. ఈ సందర్భంగా మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పెంచలయ్య మాట్లాడుతూ హోమ్ అప్లయిన్స్, హ్యాండ్‌మెడ్ వర్కులు, బ్యూటీషియన్ రంగాల్లో శిక్షణ ఇప్పించడమే కాకుండా ప్రతిరోజు పని ఉండేలా ఉపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీవో చందన, లత, సులోచనమ్మ, ఉషా, లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

వాకాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త పల్లాపు మునెయ్య(67) సోమవారం మృతి చెందింది. ఆమె అంత్యక్రియల కోసం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ టీడీపీ నాయకులు తీపలపూడి రమణయ్య, మల్లాపు రమణయ్య, వెంకటాద్రి, ప్రదీప్‌కుమార్ ద్వారా రూ.5వేలు అందజేశారు.

గణతంత్ర వేడుకలకు వెంకటగిరి విద్యార్థి



వివేక్

వెంకటగిరి టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన మద్దిల లక్ష్మణ్, లక్ష్మి దంపతుల కుమారుడు వివేక్ ఈనెల 26వ తేదీన ఢిల్లీలో జరగనున్న గణతంత్ర వేడుకలకు ఎంపికయ్యాడు. మచిలీపట్నంలో కృష్ణా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ రెండో సంవత్సరం చదువుతున్న వివేక్ డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీ అటాచ్‌మెంట్ శిబిరానికి ఏపీ ఎన్‌సీసీ విభాగం నుంచి ఎంపికయ్యాడు. గతేడాది డిసెంబరు 23 నుంచి ఈనెల 3వ తేదీ వరకు శిక్షణ పూర్తి చేసుకున్నాడు. అక్కడ జరిగిన వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి గార్డ్ ఆఫ్ హానర్ పథకం సాధించాడు. ఈనెల 26వ తేదీన ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము సమక్షంలో జరిగే పెరేడ్‌లో పాల్గొంటాడు. తమ కుమారుడు ఢిల్లీలో గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు ఎంపికవడం పట్ల వివేక్ తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

చిట్టమూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మెట్టు స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 8 ట్రాక్టర్లను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ చిన్న బలరామయ్య తెలిపారు. ట్రాక్టర్లను మైనింగ్ అధికారులకు అప్పగించామని చెప్పారు.



మన్నారుపోలూరు, టిడ్కో ఇళ్ల సమీపంలోని జగనన్న కాలనీలో మట్టి తవ్వడంతో ఏర్పడిన గుంతలు

జగనన్న కాలనీల్లోనూ తవ్వేస్తున్నారు!

- యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు
- గుంతలమయంగా పేదల ఇళ్ల స్థలాల లేఅవుట్
- చోద్యం చూస్తున్న అధికారులు

సూళ్లూరుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పేదల ఇళ్ల స్థలాలు ఇచ్చిన జగనన్న కాలనీ లేఅవుట్‌లోనూ మట్టిని అక్రమంగా తవ్వి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా తెలిసిన అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో సూళ్లూరుపేట మున్సిపాలిటీలోని మన్నారుపోలూరు రెవెన్యూ పరిధిలో శ్రీకాళహస్తికి వెళ్లే రోడ్డు పక్కన సర్వే నెంబరు 100-1, 101-3, 100-2ఏ, 100-3, 231లో 30.54 ఎకరాలు, సర్వే నెంబరు 270లో 9.98 ఎకరాలు కలిపి మొత్తం 40.50 ఎకరాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రెండు లే అవుట్లు ఏర్పాటు చేశారు. స్థలాలు ఇవ్వగా కొంతమంది లబ్ధిదారులు గృహాలు సైతం నిర్మించుకున్నారు. ఇటీవల కొందరు అక్కడ ఉన్న రెండు లే అవుట్ల నుంచి గ్రావెల్ ఇబ్బడి ముబ్బడి తవ్వి కొత్తగా వేస్తున్న వెంచర్లకు తరలిస్తున్నారు. ఇదేమని ప్రశ్నించినా సరైన సమాధానం చెప్పడం లేదని ఇళ్ల స్థలాల లబ్ధిదారులు వాపో తున్నారు. నివేశ స్థలాల లే అవుట్‌లో గ్రావెల్ తవ్వడంతో భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. అదే విధంగా టిడ్కో ఇళ్ల ఎదురుగా ఉన్న జగనన్న కాలనీలో మట్టిని అందినకాడికి తవ్వేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ మట్టి మాఫియా వైసీపీ నాయకుల కనుసన్నల్లో జరుగుతోందని, వీరికి అధికార పార్టీకి చెందిన నేతల అండదండలు ఉండటంతో అడ్డూఅదుపు లేకుండా పోతోందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి ఇళ్ల స్థలాల్లో మట్టి తవ్వకాలను అరికట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి కృషితోనే విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా: పాశిం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషితోనే విశాఖ ఉక్కు కర్మాగారానికి రూ.11,440 కోట్లు ప్యాకేజీని కేంద్రం అందించిందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పట్టించుకోకపోవడంతో నష్టాల ఊబిలో కూరుకుపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉక్కు కర్మాగారానికి పూర్వవైభవం తీసుకువచ్చేలా సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేశారన్నారు. ఫలితంగా కేంద్ర క్యాబినేట్ రూ.11,440 కోట్ల ప్యాకేజీని ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీం, వెంకటేశ్వర్లురాజు, ఇశ్రాయిల్‌కుమార్, గుండాల లీలావతి, జలీల్‌ఆహ్మద్, కోటేశ్వరరావు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ పరిశోధనా కేంద్రానికి యంత్రాల వితరణ



యంత్రాలు అందజేస్తున్న నరేంద్ర నాథ్

వెంకటగిరిటౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం నిమ్మ, చీని పరిశోధనా కేంద్రానికి మేనకూరు సెజ్‌లోని ఇండస్ కాఫీ పరిశ్రమ డైరెక్టర్ నరేంద్ర నాథ్ యంత్రాలను వితరణ చేశారు. మంగళవారం నిమ్మ పరిశోధనా కేంద్రంలో శాస్త్రవేత్త డాక్టర్ శ్యాం సుందర్ రెడ్డికి యంత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఇండస్ డైరెక్టర్ నరేంద్రనాథ్ మాట్లాడుతూ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రెండు పవర్ వీడర్ మెషిన్లు, కొమ్మలు కత్తిరించే యంత్రం, గట్ల మీద కలుపు గడ్డి కోత యంత్రం, 75 అంగుళాల ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ డిస్ప్లేలను అందించామన్నారు. కార్యక్రమంలో ఇండస్ కాఫీ పరిశ్రమ జీఎం మనీష్ మిశ్ర, హెచ్‌ఆర్ హెడ్ రమేష్, సీఎఫ్‌వో మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ పోరుబాట

పెళ్లకూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని రోసనూరు గ్రామంలో మంగళవారం వైసీపీ నాయకులు పోరుబాట నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్డీసీసీటీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఇలకా సుధారాణి, ఎంపీటీసీలు కన్నలి కుమార్‌స్వామి, సుజాత, నాయకులు అట్ల కృష్ణయ్య, కామిరెడ్డి రాజారెడ్డి, తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎల్లు మోహన్, పగడాల హరిబాబురెడ్డి, సాగి జితేంద్ర, బండి బాలు తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే వైసీపీ పోరాటం: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉనికి కోసమే వైసీపీ పోరాటం చేస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ఆనకట్ట ఆయకట్టు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని తాళ్వాయిపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేయడంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. పేదల కోసం సంక్షేమ పథకాలను తీసుకొచ్చింది టీడీపీనేనని అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు వైసీపీ నాయకులు కుయుక్తులను పన్నుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నేలవల్లి సిద్దులయ్య నాయుడు, మాడుపూరు సిద్దులయ్య నాయుడు, పరుశురామ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నాన్‌టీచింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

గూడూరు అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ ఉద్యోగుల భవనంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా చట్టప్రకారం ఉద్యోగులకు ఇవ్వాల్సిన వేతనాలను తగ్గించి, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసిన యాజమాన్యం నిరంకుశ విధానాలను తూర్పార పట్టారు. నాన్‌టీచింగ్ ఉద్యోగులు సర్వీసులో మరణించినా వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియమాకాలు, న్యాయంగా రావాల్సిన ప్రయోజనాలను ఇవ్వకపోవడం బాధకరమన్నారు. యాజమాన్యం నిరంకుశ వైఖరిని వీడనాడి నాన్‌టీచింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో కోర్టు తీర్పును తక్షణం అమలు చేయాలని కోరారు. సమావేశంలో బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్ కుమార్, నయాం, భాస్కర్‌గౌడ్, చంద్రశేఖర్, ప్రభాకర్, శశికుమార్, బీవీ రమణయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాల్గొన్న నాయకులు

డీఎస్పీకి అభినందనలు



డీఎస్పీ గీతాకుమారిని సన్మానిస్తున్న శ్రీనివాసులు, సులక్ష్మి

గూడూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గూడూరు డీఎస్పీ గీతా కుమారిని మంగళవారం సునీత సేవా సంస్థ ప్రతినిధులు సారంగం శ్రీనివాసులు, సులక్ష్మి మర్యాదపూర్వంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించి అభినంద నలు తెలిపారు.

క్రీడాకారులకు ప్రశంస

గూడూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని క్రీడాకారులు జాతీయ స్థాయిలో సత్తాచాటడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. 80 మీటర్ల హ్యాడింల్స్ గోల్డ్‌మెడల్ సాధించిన తనూజ్ తేజను అభినందించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.పది లక్షల నగదు బహుమతికి తాను సిఫారస్సు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

పెళ్లకూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు ఏర్పాటు చేస్తున్న పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య కోరారు. మంగళవారం కొత్తూరు, పెళ్లకూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పశు వైద్యుడు గుణశేఖర్ మాట్లాడుతూ వైద్య శిబిరాల్లో పశువులకు ఎటువంటి వ్యాధులు సోకినా ఉచితంగా చికిత్స చేసి మందులు అందిస్తామన్నారు. అనంతరం పశువులకు గర్భకోశ వ్యాధుల నివారణకు, దూడలకు నట్టల నివారణ మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ విజయ, వెటర్నరీ సిబ్బంది లతవ్యకుమార్, ప్రేమ్‌కుమార్ పెంచలమ్మ, ప్రభావతి, నికోరాణి, ముకుంద తదితరులు పాల్గొన్నారు.

లెనిన్‌కు నివాళి

గూడూరు అర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సీపీఐ ఆధ్వర్యంలో విప్లవ వీరుడు లెనిన్ వర్ధంతి జరిగింది. ఆయన చిత్రపటానికి పలు రాజకీయ పార్టీల నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభాకర్, చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, ఎంబేటి చంద్రయ్య, జమాలుల్లా, కాలేషా, రమేష్, శశికుమార్, సీపీఐ నాయులు, ఏఐటీయూసీ, బీఎస్పీ, కాంగ్రెస్, ఇన్సాఫ్ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న విజయభాస్కర్ రెడ్డి, దయాకర్ రెడ్డి

సూళ్లూరుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సామంచి శ్రీనివాస్‌ను మంగళవారం తిరుపతిలో సూళ్లూరుపేటకు చెందిన బీజేపీ నాయకులు ఆరణి విజయ భాస్కర్ రెడ్డి, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీనివాస్‌ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

వైసీపీ నాయకుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడండి



సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో మాట్లాడుతున్న కొత్తపాళెం గ్రామస్తులు

చిట్టమూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పశువుల మేత కోసం వదిలి పెట్టిన ఉప్పటేరు ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు దౌర్జన్యంగా ఆక్రమించుకుని సాగు చేస్తున్నారని బురదగాలి కొత్తపాళెం గ్రామస్తులు మంగళవారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు ఫిర్యాదు చేశారు. బురదగాలి కొత్తపాళెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 1లో ఉప్పుటేరు ప్రభుత్వ భూమిని పశువుల మేత కోసం వదిలిపెట్టారని, ఆ భూములను ఇదే గ్రామానికి చెందిన గిరిరెడ్డిఆక్రమించుకున్నారని, తహసీల్దారు హెచ్చరిక బోర్డు పెట్టినప్పటికీ లెక్క చేయకుండా వరి సాగుకు సిద్ధపడ్డారని తెలిపారు. విచారించి తగు చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ చెప్పారు.

జేఈఈ మెయిన్స్ పరీక్షా కేంద్రం పరిశీలన



కళాశాలలో అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్, డీఎస్పీ

కోట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జేఈఈ మెయిన్స్ పరీక్ష కేంద్రాలను మంగళవారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఎస్పీ గీతాకుమారి పరిశీలించారు. ఈ కళాశాలలో ఈనెల 30వ తేదీ వరకు జేఈఈ మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షా కేంద్రంలో వసతులు, ల్యాబ్‌లు కంప్యూటర్లను సబ్ కలెక్టర్, డీఎస్పీ, పరిశీలించారు. అనంతరం తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణుతో చర్చించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ కిషొంధర్, వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, స్థానిక ఎస్ఐ పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో రోగులతో అసభ్య ప్రవర్తన

సూళ్లూరుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి ప్రభుత్వాస్పత్రిలోకి వెళ్లి రోగులతో అసభ్యంగా ప్రవర్తించి, ఓ రోగిపై చెయ్యి చేసుకొన్న ఘటన మంగళవారం సూళ్లూరుపేటలో చోటుచేసుకొంది. స్థానికుల సమాచారం మేరకు... ఎమర్జెన్సీ కొత్త వార్డు భవనంలోకి మద్యం సేవించిన ఓ గుర్తు తెలియని వ్యక్తి చొరబడి అక్కడ చికిత్స పొందుతున్న వారితో అసభ్యంగా మాట్లాడుతూ ఓ రోగిపై చెయ్యి చేసుకొన్నాడు. వెంటనే అక్కడున్న రోగుల బంధువులు, ఆస్పత్రి సిబ్బంది మద్యం మత్తులో ఉన్న వ్యక్తికి దేహశుద్ధి చేసి ఆస్పత్రి నుంచి బయటకు పంపించేశారు.

అన్నచెరువు అలుగు నిర్మాణం చేపట్టండి



పొలాల వద్ద మాట్లాడుతున్న రైతులు

వాకాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం అన్న చెరువు అలుగు నిర్మాణం చేపట్టకపోవడంతో తమ భూములు ముంపునకు గురవుతున్నాయని కొండాపురం, వడ్డిపాళెం గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ అలుగు తొలగించడంతో తెలుగుగంగ జలాలు చెరువులోకి చేరినప్పుడు ఒప్పొంగి తమ భూములు మునిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 150 ఎకరాలకు పైగా భూమి వరదనీటిలో ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పలుమార్లు ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం అందజేసినప్పటికీ పరిష్కారం చూపలేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని రైతులు కోరారు.

చిన్నారులకు ఆధార్ తప్పనిసరి

పిచ్చాటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందాలంటే ఆరు సంవత్సరాల్లోపు చిన్నారులకు ఆధార్‌కార్డు తప్పనిసరి అని ఎంపీడీవో మహ్మద్‌రఫి తెలిపారు. మంగళవారం ముడియూరు సచివాలయంలో చిన్నారులకు ఆధార్ న మోదు ప్రక్రియను ఆయన ప్రారంభించా రు. సచివాలయ పరిధిలోని 6 అంగన్ వాడీ కేంద్రాల కార్యకర్తలు ఆధార్ నమోదు కాని చిన్నారులను వారి తల్లిదండ్రుల ద్వారా కేంద్రానికి తీసుకొచ్చి నమోదు చేయించారు.